KANCHARLA

# మనసులో మాట

నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. | సంచలన తెలుగు దిన పత్రిక

## రాయలసీమ

| | | |
|---|---|---|
| చిత్తూరు | అన్నమయ్య | అనంతపురం |
| కర్నూలు | కడప | నెల్లూరు |

ఆదివారం 30 ఆగస్టు 2026 — పేజీలు 16


## నెల్లూరు ప్రజలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం

- రూ.3 కోట్ల విలువైన మొబైల్ వ్యాన్‌తో ఇంటి వద్దకే వైద్య సేవలు..
- 12,200 మందికి ఉచిత కంటి పరీక్షలు



2



# ఆగస్టు 30న చిత్తూరు జిల్లాలో నీట్-పీజీ

- 2026 పరీక్ష పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి..
- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**చిత్తూరు ఆగస్టు, 29 (మనసులో మాట):**

చిత్తూరు జిల్లాలో నీట్‌పీజీ-2026 పరీక్షను ఆగస్టు 30, 2026న ప్రశాంతంగా, పారదర్శకంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సంబంధించి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో అవసరమైన చర్యలు చేపట్టాలని శనివారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులను ఆదేశించారుఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 594 మంది అభ్యర్థులు కంప్యూటర్ ఆధారిత విధానంలో పరీక్షకు

..మిగతా 14లో



## ఉదయగిరిలో అభివృద్ధి పరుగులు..

- రూ.34 కోట్లతో 34 మొబైల్ టవర్లు..
- జనార్ధనపురంలో టవర్ నిర్మాణానికి శంకుస్థాపన

**నెల్లూరు/ఉదయగిరి, ఆగస్టు 29, మనసులో మాట:**

ఉదయగిరి నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగవంతం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని నెల్లూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండి ఫరూఖ్, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. నియోజకవర్గ పర్యటనలో భాగంగా వారు పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

**శ్రీ వెంగమాంబ పేరంటాల అమ్మవారికి ప్రత్యేక పూజలు**

దుత్తలూరు మండలం నర్రవాడలో కొలువై ఉన్న శ్రీ వెంగమాంబ పేరంటాల అమ్మవారిని మంత్రులు ఎన్ఎండి ఫరూఖ్, వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే కాకర్ల సురేష్, మాజీ ఎమ్మెల్యే కంభం రామిరెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ చెంచల్ బాబు యాదవ్ దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రులు, ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నర్రవాడలో శ్రీ వెంగమాంబ పేరంటాల అమ్మవారిని దర్శించుకున్న మంత్రులు ఫరూఖ్, వాసంశెట్టి సుభాష్,

..మిగతా10లో



2

మనసులో మాట కథనానికి స్పందన..

## శ్రీరామనగర్ కాలనీలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

## పీవీఎస్ పాఠశాలలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం–మాతృభాష దినోత్సవం



2

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# మనసులో మాట కథనానికి స్పందన..
## శ్రీరామనగర్ కాలనీలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



**శ్రీకాళహస్తి, ఆగస్టు 29 (మనసులో మాట) :** శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీరామనగర్ కాలనీ రోటరీ క్లబ్ వద్ద రహదారి దుస్థితిపై ఈ నెల 11వ తేదీన మనసులో మాట "శ్రీరామనగర్ కాలనీ రహదారి పరిస్థితి ఇది" అంటూ కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి వెంటనే స్పందించారు.వర్షాకాలంలో రోటరీ క్లబ్ సమీప ప్రాంతంలో వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని గుర్తించిన కమిషనర్ కృష్ణారెడ్డి సంబంధిత ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సీసీ రోడ్డు నిర్మాణ పనులకు చర్యలు చేపట్టారు.ప్రస్తుతం శ్రీరామనగర్ కాలనీ రోటరీ క్లబ్ వద్ద సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. రహదారి నిర్మాణంతో వర్షపు నీరు నిలిచిపోవడం, ప్రజలు రాకపోకలకు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగనున్నాయి.మనసులో మాటలో వచ్చిన కథనంపై స్పందించి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌తో పాటు మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# పలమనేరు సుల్తాన్ హోటల్లో మున్సిపల్ అధికారులు తనిఖీ




**పలమనేరు ఆగస్టు 29( మనసులో మాట):**

పలమనేరు పట్టణంలోని చెన్నై బెంగళూరు జాతీయ రహదారి పై ఉన్న సుల్తాన్ హోటల్లో ప్రతిరోజు చికెన్ బిర్యాని తయారుచేసి ప్రజలకు విక్రయిస్తారు. శనివారం ఆ హోటల్ పై మున్సిపల్ శాఖ సానిటరీ ఇన్స్పెక్టర్ బాబు రెడ్డి నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హోటల్ నందు కుళ్ళిన మాంసాన్ని వారు కంట పడింది. హోటల్ నందు అశుభ్రంగా ఉన్నది. ఆహారాన్ని ప్రజలకు ఎలా విక్రయిస్తారని వారు ప్రశ్నించారు. ఫ్రిడ్జ్ లో పెట్టిన చికెన్, చాపలు తదితర వంటివి దుర్వాసన రావడం జరిగిందన్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ లోకేశ్వర వర్మకు సానిటరీ ఇన్స్పెక్టర్ బాబు రెడ్డి నాయక్ ఫోన్ ద్వారా తెలిపారు. ఆ షాపు నిర్వాహకులకు 5000 రూపాయలు జరిమానా విధించడం జరిగిందని అధికారులు తెలిపారు. ఇలాంటి ఆహార పదార్థాలు ఇకమీదట విక్రయిస్తే కఠిన చర్యలు చేపడతామని మున్సిపల్ ఆక్ట్ ప్రకారం కేసు నమోదు చేస్తామని తెలియజేశారు.

# అంబేద్కర్ గురుకులాన్ని తనిఖీ చేసిన జడ్జి భరత్ కమల్



**రామాపురం ఆగస్టు 29 మనసులో మాట :**

రామాపురం మండలం లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం స్కూళ్లు రామాపురం నందు లక్కిరెడ్డిపల్లె జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ స్టేట్ కోర్టు లక్కిరెడ్డిపల్లి జడ్జి సిహెచ్ భరత్ కమల్ సడన్ గా తనిఖీ చేసి స్కూల్ వాతావరణం మరియు ఫుడ్ క్వాంటిటీ స్టోర్ రూమ్ మరియు వాష్రూమ్స్ మొదలగునవి స్వయంగా పరిశీలించి పిల్లలతో ఇంట్రాక్ట్ అయి గల విషయాలు డిస్కస్ చేసి పిల్లల యొక్క బాగోగులు అడిగి తెలుసుకుని స్కూల్ వాతావరణ పరిస్థితులు మొదలగు విషయాలు అవగాహన చేసుకుని హాస్టల్లో చదువుకుని మంచి భవిష్యత్తు ఏర్పాటు చేసుకోవాలని తెలియ పరచడమైనది.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ చిన్న,స్కూల్ సిబ్బంది, రామాపురం కోర్ట్ కానిస్టేబుల్ శివ పాల్గొన్నారు.




# నెల్లూరు ప్రజలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం

- రూ.3 కోట్ల విలువైన మొబైల్ వ్యాన్‌తో ఇంటి వద్దకే వైద్య సేవలు..
- 12,200 మందికి ఉచిత కంటి పరీక్షలు



**నెల్లూరు, ప్రతినిధి, ఆగస్టు, మనసులో మాట:**

పేద, మధ్యతరగతి ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను ఉచితంగా అందించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న నారాయణ నేత్ర జ్యోతి, నారాయణ దంత సురక్ష ఉచిత వైద్య శిబిరాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. నెల్లూరు నగరంలోని 7వ డివిజన్ స్టోన్‌హౌస్‌పేటలోని బీవీఎస్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో ఉచిత కంటి, దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ పొంగూరు నారాయణ సొంత నిధులతో సుమారు రూ.3 కోట్ల విలువైన ఆధునిక వైద్య పరికరాలతో కూడిన మొబైల్ వ్యాన్ ద్వారా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల చెంతకే కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను తీసుకెళ్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శిబిరంలో ప్రజలకు ఉచిత కంటి, దంత పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి వైద్య సలహాలు అందించారు. నారాయణ హాస్పిటల్స్ కంటి విభాగం ప్రొఫెసర్ డాక్టర్ సుధా, స్థానిక డివిజన్ కార్పొరేటర్ మల్యాద్రి మాట్లాడుతూ ప్రజల రోజువారీ పనులకు ఇబ్బంది కలగకుండా ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలతో పాటు పాఠశాలల్లోనూ సీనియర్ వైద్యులతో ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు 12,200 మందికి పైగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించగా, పరీక్షలు పూర్తయిన రెండు రోజుల్లోనే 6,900 మందికి పైగా నాణ్యమైన కంటి అద్దాలను ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. అలాగే 250 మందికి పైగా క్యాటరాక్ట్ శస్త్రచికిత్సలను ఉచితంగా విజయవంతంగా నిర్వహించినట్లు వెల్లడించారు. శిబిరంలో బీవీఎస్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు, యువతకు నేత్రదానం విశిష్టతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిన్న వయస్సు నుంచే నేత్రదానంపై అవగాహన పెంపొందించుకోవాలని వైద్యులు సూచించారు. అంధత్వ నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా డయాబెటిక్ రెటినోపతి, గ్లాకోమా వంటి దీర్ఘకాలిక కంటి సమస్యలపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. కంటి సమస్యను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స పొందడం ద్వారా చూపును కాపాడుకోవచ్చని వైద్యులు వివరించారు. రూపాయి ఖర్చు లేకుండా అందుబాటులోకి వస్తున్న ఈ కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ జనరల్ శేఖర్ రెడ్డి, కిన్నెర సాగర్‌తో పాటు స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వైద్య సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

మనసులో మాట

# మదన్ మోహన్ నాయుడు మృతి బాధాకరం



- **టీడీపీ నేతలు గాలి చలపతి నాయుడు, గాలి మురళి నాయుడు**

**తొట్టంబేడు, ఆగష్టు 29 (మనసులో మాట) :**

తొట్టంబేడు మండలం పొయ్యి కొత్తూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు మదన్ మోహన్ నాయుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని రాష్ట్ర మాజీ కార్యదర్శి గాలి చలపతి నాయుడు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు గాలి మురళి నాయుడు అన్నారు. పని నిమిత్తం ద్వి చక్ర వాహనంపై తిరుపతికి వెళ్తుండగా మార్గమధ్యంలో అంబులెన్స్‌ను దాటే క్రమంలో ప్రమాదానికి గురయ్యారని తెలిపారు. వెంటనే తిరుపతిలోని బాలాజీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినప్పటికీ, చికిత్స పొందుతూ మదన్ మోహన్ నాయుడు తుదిశ్వాస విడిచారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదన్ మోహన్ నాయుడు మృతి పార్టీకి, గ్రామానికి తీరని లోటని అన్నారు. బాధిత కుటుంబానికి తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కుటుంబ పరిస్థితిని ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన సహాయ సహకారాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# అన్నయ్యలకు రాఖీ కట్టిన ఓం శాంతి అక్కయ్య



**కడప ఆగస్టు 29 (మనసులో మాట):**

రాఖీ పండుగ సందర్భంగా జనం కోసం క్రీడా, విద్యా, సేవా సాంస్కృతిక సంస్థ రాష్ట్ర అధ్యక్షులు లయన్ ఖాదర్ బాషా కడప నగరంలోని ఓం శాంతి నిలయాన్ని సందర్శించారు. అక్కడి అక్కయ్యలను కలిసి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఓం శాంతి ఈశ్వరి అక్కయ్య, లయన్ ఖాదర్ బాషా, ఆర్కే రాయల్ కరిములకు రాఖీలు కట్టి వారి ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా రాఖీ పండుగ ప్రేమ, ఆప్యాయత, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఓం శాంతి నిలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో కొనసాగింది. ఈ సందర్భంగా పరస్పరం రాఖీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

# శుభకార్యానికి వెళ్లి వస్తుండగా ఘోర ప్రమాదం.. ఆటోను ఢీకొన్న గుర్తుతెలియని వాహనం!

- **బోల్తాపడిన ఆటో.. పది మందికి గాయాలు**
- **ఇద్దరికి కాళ్లు విరగగా.. ఒకరి పరిస్థితి విషమం**

**ముదిగుబ్బ, ఆగస్టు 29: (మనసులో మాట):**

ముదిగుబ్బ మండలంలోని పొడరాళ్లపల్లి క్రాస్ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయ మలుపు వద్ద గురువారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గుర్తుతెలియని వాహనం ఆటోను ఢీకొనడంతో ఆటో బోల్తాపడి, అందులో ప్రయాణిస్తున్న పది మందికి గాయాలయ్యాయి. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. పొడరాళ్లపల్లి గ్రామంలో జరిగిన శుభకార్యానికి హాజరై తిరిగి మంగళమడక గ్రామానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అదుపుతప్పిన ఆటో బోల్తాపడింది. ప్రమాదంలో ఇద్దరికి కాళ్లు విరిగిపోగా,



మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మరో ముగ్గురికి స్వల్ప గాయాలైనట్లు సమాచారం. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే ముదిగుబ్బ 108 సిబ్బంది ఈఎంటీ మల్లేష్, పైలట్ నారాయణస్వామి నాయక్ సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించారు. అనంతరం నలుగురు క్షతగాత్రులను బత్తలపల్లి ఆర్‌డీటీ ఆసుపత్రికి తరలించారు. బుక్కపట్నం 108 సిబ్బంది ఈఎంటీ రమేష్, పైలట్ జగన్నాథం కూడా సంఘటనా స్థలానికి చేరుకుని మిగతా క్షతగాత్రులను కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.




రాత్రివేళ జరిగిన ఈ ప్రమాదంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. ప్రమాదానికి కారణమైన గుర్తుతెలియని వాహనం కోసం పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం.

# పీవీఎస్ పాఠశాలలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం–మాతృభాష దినోత్సవం






**ముదిగుబ్బ, ఆగస్టు 29: (మనసులో మాట) :**

స్థానిక పీవీఎస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో జాతీయ క్రీడా దినోత్సవం, మాతృభాష దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ వెంకట చలపతి, రమణయ్య హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎంఈఓ వెంకట చలపతి మాట్లాడుతూ.. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, పట్టుదల, ఆరోగ్యకరమైన పోటీ తత్వాన్ని పెంపొందిస్తాయని అన్నారు. చదువుతో పాటు క్రీడలకు కూడా సముచిత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మాతృభాష మన సంస్కృతి, సంప్రదాయాలు, భావాలను తరతరాలకు అందించే వారధి అని, ప్రతి విద్యార్థి తన మాతృభాషను గౌరవించి పరిరక్షించాలని పిలుపునిచ్చారు. పాఠశాల చైర్మన్ పి.వి. నాయుడు



మాట్లాడుతూ.. క్రీడలు విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఓటమిని స్వీకరించడం, విజయాన్ని సమతుల్యంగా ఆస్వాదించడం, జట్టు స్ఫూర్తితో ముందుకు సాగడం వంటి విలువలు అలవడతాయని పేర్కొన్నారు. రమణయ్య మాట్లాడుతూ.. మాతృభాష ప్రతి ఒక్కరి జీవితంలో ప్రత్యేకమైన స్థానాన్ని కలిగి ఉంటుందని, భాషను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించింది. విద్యార్థులు ఉత్సాహంగా క్రీడా పోటీల్లో పాల్గొని క్రీడాస్ఫూర్తిని చాటారు. అలాగే మాతృభాష ప్రాధాన్యతపై విద్యార్థులు ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడలు-విద్య సమతుల్యత, ఆరోగ్యకరమైన జీవన శైలి, మాతృభాష పరిరక్షణ, సంస్కృతి-సంప్రదాయాల పట్ల గౌరవం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.

# తెలుగు మన గర్వం.. క్రీడలు మన బలం.. విద్యార్థులే భవిష్యత్తు

- **ఆక్స్ఫర్డ్ గ్లోబల్ స్కూల్‌లో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం**

**ముదిగుబ్బ, ఆగస్టు 29: (మనసులో మాట):**

ముదిగుబ్బ మండల కేంద్రంలోని ఆక్స్ఫర్డ్ గ్లోబల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి జి. వెంకట చలపతి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాషను గౌరవించి, మాతృభాష గొప్పతనాన్ని ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని సూచించారు. అదే




విధంగా క్రీడలు విద్యార్థుల్లో ఆరోగ్యం, క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు వై. హరీష్, ఏ. రామమోహన్, ప్రిన్సిపాల్స్ వై. సుధాకర్, శివారెడ్డి, అర్షియా, వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్ర, ఫిజిక్స్ డైరెక్టర్ తరుణ్ పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. తెలుగు భాషా ప్రాధాన్యతను చాటుతూ విద్యార్థులు చేసిన ప్రదర్శనలు, క్రీడా నైపుణ్యాలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాఠశాల ప్రాంగణం విద్యార్థుల ఉత్సాహంతో సందడిగా మారింది. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో ముగిసింది.

# ఘనంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలు




**శ్రీకాళహస్తి, ఆగష్టు 29 (మనసులో మాట) :**

శ్రీకాళహస్తి లోని ఎస్.వి.ఏ. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో శనివారం తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.బి. వాణిశ్రీ మాట్లాడుతూ దేశ భాషలందు తెలుగు లెస్స అనే పేరుగాంచిన తెలుగు భాష గొప్పతనాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించి, భాషను పరిరక్షించుకోవాలని అన్నారు. గిడుగు రామమూర్తి పంతులు తెలుగు భాషను సామాన్యులకు చేరువ చేయడానికి చేసిన కృషి మరువలేనిదన్నారు.విద్యార్థులకు ఉపన్యాసం, వ్యాసరచన, పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ మన్యం నరసింహులు విద్యార్థులతో తెలుగు భాష పరిరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. తెలుగు మాధ్యమాన్ని తిరిగి ప్రవేశపెట్టాలని, పోటీ పరీక్షల్లో తెలుగుకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రభుత్వ ఉత్తర్వులు తెలుగులో వెలువరించాలని, ప్రభుత్వ కార్యాలయాలు, దుకాణాల నామఫలకాలు తెలుగులో ఉండాలని తీర్మానాలు ఆమోదించారు.

**ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం**

మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.బి. వాణిశ్రీ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలకు కూడా సమ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. క్రీడలతో విద్యార్థుల్లో శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని అన్నారు. 150 కోట్లకు పైగా జనాభా ఉన్న భారత్ ఒలింపిక్స్‌లో మరిన్ని పతకాలు సాధించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమాల్లో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మన్యం నరసింహులు, డాక్టర్ భాస్కర్, డాక్టర్ కే. సుబ్బారావు, డాక్టర్ బాపనయ్య, డాక్టర్ పి. గాయత్రి, డాక్టర్ రమేష్ బాబు, డాక్టర్ సామ్సన్ రాజు, డాక్టర్ పి. వేణుగోపాల్, టి. నరసింహులు, డాక్టర్ వి. వాసవి, డాక్టర్ రవి ప్రసాద్, డాక్టర్ చంద్ర మౌళి తదితర అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# రోడ్డుపై ఆటోలు నిలపొద్దు.. ఓవర్‌లోడ్‌కు దూరంగా ఉండాలి




- సీఐ రామసుబ్బయ్య

**ముదిగుబ్బ, ఆగస్టు 29: (మనసులో మాట)**

రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ముదిగుబ్బ సి ఐ కె. రామసుబ్బయ్య సూచించారు. శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్. సతీష్‌కుమార్ ఐపీఎస్ ఆదేశాలు, ధర్మవరం సబ్ డివిజన్ పోలీస్ అధికారి బి.వి. జగన్నాథ రాజు సూచనల మేరకు ముదిగుబ్బ యూజీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రామసుబ్బయ్య ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి పలు సూచనలు చేశారు. రహదారిపై, రోడ్డు పక్కన ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా ఆటోలను నిలపరాదన్నారు. ప్రయాణికులను ఎక్కించే, దించే సమయంలో ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆటోల్లో నిర్దేశిత పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని ఓవర్‌లోడ్ చేయరాదని స్పష్టం చేశారు. ఓవర్‌లోడ్ వల్ల వాహనంపై నియంత్రణ కోల్పోయి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ప్రయాణికుల భద్రతకు డ్రైవర్లు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు కలిగి ఉండాలని, వేగంగా, నిర్లక్ష్యంగా వాహనాలు నడపరాదని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ వాహనాలను అడ్డంగా నిలపడం, ఓవర్‌లోడ్ చేయడం, ఇతరులకు ప్రమాదం కలిగించేలా వాహనాలు నడపడం వంటి చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల ప్రాణాల రక్షణే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని, రోడ్డు ప్రమాదాల నివారణకు ఆటో డ్రైవర్లు పోలీసులకు సహకరించాలని సీఐ రామసుబ్బయ్య కోరారు. “నిబంధనలు పాటిద్దాం.. సురక్షితంగా ప్రయాణిద్దాం.. ప్రాణాలను కాపాడుకుందాం” అని ఆయన పిలుపునిచ్చారు.

## క్రీడా స్ఫూర్తితో ఉరకలేసిన విద్యార్థులు.. తెలుగు పద్యాలతో అలరించిన చిన్నారులు



**ముదిగుబ్బ, ఆగస్టు 29: (మనసులో మాట):**

ముదిగుబ్బ మండలం కొడవండ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అలాగే తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు పద్యాల పోటీలు నిర్వహించారు. తెలుగు పద్యాలను చక్కగా ఆలపించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని, మాతృభాషపై అభిమానం పెంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామానాయుడు, ఉపాధ్యాయులు చిదంబరరెడ్డి, ఆంజనేయులు, మహబూబ్ బాషా, వ్యాయామ ఉపాధ్యాయుడు శాంతలింగం తదితరులు పాల్గొన్నారు.



## నూతన సీఐ రామసుబ్బయ్యకు బీజేపీ జిల్లా నేతల శుభాకాంక్షలు



**ముదిగుబ్బ, ఆగస్టు 29: (మనసులో మాట) :**

మండల కేంద్రంలోని అర్బన్ పోలీస్ స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. రామసుబ్బయ్యను బీజేపీ జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా యువ మోర్చా అధ్యక్షుడు బిల్లుకుల్లాయప్ప, గడ్డం మోహన్ తదితరులు సీఐ రామసుబ్బయ్యకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు చేస్తున్న కృషిని వారు అభినందించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన పోలీస్ సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తమిళనాడు గవర్నర్ ను కలిసిన ఆపాస్ మీడియా ఇంచార్జ్ కరెడ్ల వెంకటేశ్వర్లు



**లక్కిరెడ్డిపల్లి ఆగస్టు,29 (మనసులోమాట):**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రివర్యులు శ్రీ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి తమిళనాడు గవర్నర్ గా నియమితులైన సందర్భంగా కిరణ్ కుమార్ రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం మీడియా ఇన్చార్జ్ కరెడ్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో సుపరిపాలన అందించిన గొప్ప ముఖ్యమంత్రిగా ఆయనను కొనియాడారు. మీసేవ, రూపాయికి కిలో బియ్యం, రాష్ట్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం స్టేట్ మిల్క్ మిషన్, రైతులకు జీరో వడ్డీ రుణం, స్త్రీ నిధి మహిళా బ్యాంక్, 1.16 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్, ఇందిర జలప్రభ వంటి అద్భుతమైన పథకాలతో ప్రజా రంజక పాలన అందించి ఉమ్మడి రాష్ట్ర విభజనను చివరి వరకు వ్యతిరేకించి పోరాడిన గొప్ప రాజకీయ నాయకుడిగా ప్రజల మనసులో నిలిచారని తెలిపారు.

## జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు



**ధర్మవరం ఆగస్టు 29 (మనసులో మాట):**

పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్‌లో ఉన్న జీవీఈ జెడ్పీజీహెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ, రాష్ట్ర స్థాయిలో జూడో, కరాటే, ఖురాష్ క్రీడల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై. సుమన ప్రశంసాపత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా హెచ్ఎం సుమన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం, ఉత్సాహం పెంపొందుతాయని తెలిపారు. ప్రతి విద్యార్థి ఆటల్లో పాల్గొని ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని ఆకాంక్షించారు.క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సంబంధిత క్రీడా సామగ్రి, బ్యాగులు, ఫింగర్ స్ప్రింగ్స్‌ను స్పాన్సర్ చేశారు. కార్యక్రమంలో పాఠశాల పీఈడీ స్వరూప, ఉపాధ్యాయురాలు సరళ, కోచ్ ఎస్. ఇనాయత్ భాషా తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థ గత ఎన్నికల్లో ధర్మవరం మున్సిపాలిటీ చైర్మన్ పదవి ఎవరిని వరిస్తుంది?

**ధర్మవరం ఆగస్టు 29 (మనసులో మాట):**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రెండు సంవత్సరాల తర్వాత స్థానిక సంస్థ గత నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వము అందుకు కావలసిన చర్యలను తీసుకుంటోంది, అయితే ధర్మవరం మున్సిపాలిటీ సంస్థ గత ఎన్నికల్లో ధర్మవరం మున్సిపాలిటీ చైర్మన్ పదవి ఎవరికి వరిస్తుంది అని ధర్మవరం పట్టణ ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 7న స్థానిక ఎన్నికలకు సన్నద్ధమైతే ఎన్డీఏ కూటమి తరపున ధర్మవరం మున్సిపాలిటీ చైర్మన్ అభ్యర్థిని ఎవరిని వరిస్తుందని, ఒకవేళ అట్లా కాకుండా ఎన్ డి ఏ తరపున కానీ, లేదా టిడిపి తరపున కానీ, లేదా జనసేన పార్టీ తరపున గాని చైర్మన్ అభ్యర్థిని ఎంపిక చేసినట్లయితే ఏ పార్టీకి సంబంధించిన వ్యక్తి అయినా మిగతా పార్టీల నాయకులను కాదని చైర్మన్ ఏమి చేసే ప్రసక్తి ఉండదని కూడా ప్రజలు భావిస్తున్నారు. టిడిపి తరపున అభ్యర్థిని నిలబెట్టితే, అందుకు ఎన్డీఏ సహకరిస్తుందా, ఒకవేళ ఎన్డీఏ తరపున అభ్యర్థిని నిలబెడితే టిడిపి సహకరిస్తుందా, ఇకపోతే జనసేన పార్టీ నుంచి అభ్యర్థిని ఎంపిక చేస్తే, ఎన్డీఏ, టీడీపీ, నాయకులు ఇరువురు సహకరిస్తారా, దీంతో కూటమిలో కాబోయే చైర్మన్ నెగ్గుకొని రాగలడా అన్న సందిగ్గం ఏర్పడింది ప్రజల్లో, ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలను పోస్ట్ ఫోన్ చేయగలిగితే ఇక మూడు సంవత్సరాలు స్థానిక ఎన్నికలు నిర్వహించే పరిస్థితి ఉండదని కూడా ప్రజలు భావిస్తున్నారు. ఇప్పటికే వైసీపీ ఎన్నికలు గత ఓటర్ లిస్ట్ ప్రకారం కాకుండా, ప్రస్తుతం జరుగుతున్న సర్ ఓటర్ లిస్ట్ వచ్చిన తర్వాత ఎన్నికలు నిర్వహించాలని కోర్టుకు వెళ్లడం జరిగింది. వీటన్నింటినీ నెగ్గుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఎన్నికలు నిర్వహించగలరా అన్న సందిగ్ధం కూడా ప్రజల్లో ఏర్పడింది. ఎన్డీఏ కూటమి తరపున ఏ అభ్యర్థి చైర్మన్గా ఎన్నికైన వారికి నాయకులనుంచి ఇబ్బందులు తప్పకుండా ఎదురవుతాయి అని మున్సిపాలిటీ పరిపాలన విభాగంలో కూడా అనేక సమస్య లు తలెత్తుతాయన్న సంశయం కూడా ప్రజల్లో ఉంది. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు సంవత్సరాలుగా ఎన్డీఏ కూటమి నాయకుల్లో అసంధితం ఉన్నదని దీనివల్ల వైసిపికి కలిసి వచ్చే అవకాశాలు కూడా ఉన్నట్లు తెలుస్తోందనీ ప్రజలు భావిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి కూడా ధర్మవరం తెలుగుదేశం పార్టీకి పెట్టని కోటవలె అండగా ఉంది. అయితే టిడిపి నాయకులు కార్యకర్తలను కాదని బిజెపి తరపున చైర్మన్ అభ్యర్థిని నిలబెట్టగలదా, జాతీయస్థాయిలో మంచి పేరు ప్రఖ్యాతలు ఉన్న బిజెపి నాయకుడిని కాదని ఎం పార్టీ చైర్మన్ అభ్యర్థులు నిలబెట్టగలదా, వీటన్నింటికీ కూడా రాష్ట్ర నాయకత్వం సమస్యలను ఎదుర్కోవలసి వస్తుందని ప్రజలు గుసగుసలాడు తున్నారు.

**చైర్మన్ పదవికి చేనేతలకు వరించేనా**

ధర్మవరం మున్సిపాలిటీ చైర్మన్ పదవి చేనేతలకు కాకుండా వేరే ఎవరికీ ఇచ్చినా కూడా చేనేతల్లో వ్యతిరేకత నెలకొందని చేనేతలు భావిస్తున్నారు. చైర్మన్ పదవికి చేనేతలకు ఎవరికిచ్చిన చేనేతలంతా సహకరించి చైర్మన్ ఎన్నుకునే అవకాశం ఉంటుందని, అలా కాకుండా వేరే ఎవరికైనా చైర్మన్ అభ్యర్థిని ఎంపిక చేస్తే చేనేతలు ఎన్డీఏ కూటానికి వ్యతిరేకంగా పని చేయాల్సి వస్తుందని కూడా చేనేతలు వాపోతున్నారు. ఎమ్మెల్యే పదవి ఎవరైనా ఆశించిన వారికి అండగా ఉంటూ చేనేతలు వారికి గెలుపు అందించే దిశగా ఎప్పుడు పని చేస్తున్నారని, చేనేతలను ధిక్కరించి పని చేయగలిగితే ఏ పార్టీ అయినా పతనం తప్పదని భావిస్తున్నారు. రాష్ట్ర నాయకత్వం కూటమి నాయకుల మనోభావాలను విచారణ చేయకుండా ఎవరిని ధర్మవరం మున్సిపాలిటీ చైర్మన్ అభ్యర్థిగా ఎంపిక చేస్తుందో వేచి చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని కూడా భావిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఎవర్ని చైర్మన్ అభ్యర్థిగా ఎంపిక చేసినప్పటికీ, ధర్మవరంలో వైసిపి పార్టీ అందుకు తగ్గట్టుగా ఎన్నికల్లో దీటుగా పోటీ చేస్తుందని మాజీ ఎమ్మెల్యే అందుకు అనుగుణంగా కూడా నాయకులను ఎంపిక చేయడం జరుగుతుందని కూడా ఆలోచనలో పడ్డారు.

**ప్రభుత్వ పథకాల్లో జరుగుతున్న అవినీతి అక్రమాలు స్థానిక ఎన్నిక లకు ఇబ్బంది కలిగేనా**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నటువంటి ప్రభుత్వ పథకాల్లో నిజమైన పేదలకు ప్రస్తుతం అమలు చేసిన చేనేత సేవా పథకం అందించడంలో విఫలమైందని, దీనివల్ల స్థానిక ఎన్నికల్లో ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని కూడా చేనేత కార్మికులు ,నాయకుల్లో విమర్శలకు తావిస్తోంది. ప్రస్తుతం నిజమైన చేనేతలకు కాకుండా చేనేత మగ్గం, అందుకు కావలసిన పరికరాలు ముడి సరుకులు ఏమిటో తెలియని వారికి కూడా చేనేత సేవా పథకం వర్తింపజేశారు అని వారికి రానున్న కాలంలో తగిన బుద్ధి చెబుతామని కూడా చేనేత కార్మికులు వాపోతున్నారు. ఇవే కాకుండా రెండు సంవత్సరాలు గడుస్తున్న నూతన పెన్షన్లను అందించకపోవడం, రెవెన్యూ, పోలీస్ అధికారుల వల్ల, వార్డుల్లో ఉన్నటువంటి నాయకులు వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు కూడా ఎన్నికల్లో వీరికి తగిన బుద్ధి చెప్పాలని కూడా యోచిస్తున్నారు. ప్రస్తుతం కూటమి నాయకుల్లో ఉన్నటువంటి ఆసందిగ్ధత పరిస్థితి ప్రజలకు మింగుడు పడడం లేదని, వీరిలో నాయకత్వ లక్షణాలు లేవని, వీరి వల్ల ప్రజలకు ఒరిగింది ఏమీ లేదని భావిస్తున్నారు. ప్రస్తుతం చుట్టపు చూపుగా సీతాకోక చిలుక మాదిరి ధర్మవరానికి వచ్చి పోతున్నారు తప్ప ధర్మవరంలో జరుగుతున్న అవినీతి అక్రమాలు ప్రజల సమస్యలను నాయకులు పట్టించుకోలేదని, వీరికి స్థానిక ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని కూడా ప్రజలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. వీటన్నింటికీ కూడా రాష్ట్ర ప్రభుత్వం ఎంతవరకు బాధ్యత వహిస్తుందని, దీనికి కారణం అవుతున్నటువంటి నాయకుల పైన ఎటువంటి చర్యలను తీసుకుంటుందో వేచి చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## శ్రావణమాసం 3 వ శనివారం కావడంతో ఆంజనేయ స్వామి ఆలయాలకు పోటెత్తిన భక్తులు

**చెన్నూరు, మనసులో మాట, ఆగస్టు,29:**

చెన్నూరు మండలం వ్యాప్తంగా శ్రావణమాసం మూడవ శనివారం కావడంతో వివిధ గ్రామాల్లో నెలకొల్పిన ఆంజనేయ స్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు, చెన్నూరు బ్రాహ్మణ వీధిలో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో ఉదయం ప్రత్యేక అభిషేక పూజలు అలంకరణ నిర్వహించారు, ఆలయం ప్రక్కన నిలువెత్తు ఆంజనేయ స్వామికి అలంకరణ నిర్వహించారు, పెన్నా నది ఒడ్డున శివాలయం ఎదురుగా నిలువెత్తు ఆంజనేయస్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు, శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉన్న



ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి, చెన్నూరు సమీపంలో బుడ్డాయిపల్లి క్రాస్ రోడ్ వద్ద ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజలు అలంకరణ నిర్వహించారు, చెన్నూరు పెన్నా నది అవతల ఒడ్డున వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు, రామనపల్లి కొండపేట కనుపర్తి వివిధ గ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు జరిగాయి, పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు నిర్వహించారు, పలు ఆలయాల్లో హనుమాన్ చాలీసా సంకీర్తన భజనలు నిర్వహించారు,

మనసులోమాట
KANCHARLA

# వాడుక భాషకు పట్టం గట్టిన చిచ్చరపిడుగు 'గిడుగు'



- సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు
- ఆచార్య గంజి పార్వతి

**కడప , మనసులో మాట, ఆగస్టు, 29:**

గ్రాంథికభాష తెలుగునాట రాజ్యమేలుతున్న రోజుల్లో వాడుకభాషకు పట్టం గట్టిన చిచ్చరపిడుగు గిడుగు వెంకట రామమూర్తి అని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య గంజి పార్వతి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం శనివారం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో గిడుగు వేంకటరామమూర్తి పంతులు 164వ జయంతిని మరియు సి.పి.బ్రౌన్ ఊహాచిత్రకారుడు మైనంపాటి వెంకట సుబ్రహ్మణ్యం 104వ జయంతిని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య గంజి పార్వతి, సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్, తెలుగు అధ్యాపకురాలు డా॥ రమ్యజ్యోతి, విశ్రాంత బ్యాంకు అధికారి ఎం.ఎస్.దామోదర గుప్త, పరిశోధన కేంద్రం సిబ్బంది, పాఠకులు కలసి గిడుగు వెంకట రామమూర్తి, మైనంపాటి వెంకట సుబ్రహ్మణ్యం చిత్రపటాలకు పూలమాల సమర్పించి నివాళులు అర్పించారు. ఆ తర్వాత సంచాలకులు ఆచార్య గంజి పార్వతి మాట్లాడుతూ ఆంగ్లేయుల పరిపాలనా కాలంలో జె.ఎ.ఏట్స్ అనే ఆంగ్లేయ పాఠశాలల అధికారి పుస్తకాలలో ఉన్న తెలుగుకు, వాడుకలో ఉన్న తెలుగుకు గల వ్యత్యాసాన్ని గుర్తించి, గిడుగు రామమూర్తితో చర్చించి ఆయనలో వ్యావహారిక భాషావాదానికి సంబంధించిన ఆలోచనను రేకెత్తించారన్నారు. గిడుగు చేపట్టిన వ్యావహారిక భాషా ఉద్యమం వల్ల ఏ కొద్దిమందికో పరిమితమైన చదువు వ్యావహారికభాషలో సాగి, అందరికీ అందుబాటులోకి వచ్చిందన్నారు. సంగీతం, సాహిత్యం, నాట్యం, చిత్రలేఖనం అనే నాలుగు లలితకళల్లో ప్రావీణ్యం కలిగి లలితకళానిధిగా కొనియాడబడుతున్న మైనంపాటి కుంచె పట్టి, భారతి పత్రికలో లభించిన బ్రౌన్ తండ్రి డేవిడ్ బ్రౌన్ ఛాయాచిత్రం ఆధారంగా సంవత్సరం పాటు శ్రమించి బ్రౌన్ ఊహాచిత్రాన్ని ఆయన సాహిత్యకృషిని వెల్లడిచేస్తూ తాళపత్ర గ్రంథ అధ్యయన నేపథ్యంతో చిత్రించారన్నారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్ మాట్లాడుతూ ఆంధ్రదేశంలో వ్యావహారిక భాషోద్యమానికి గిడుగు వెంకట రామమూర్తి మూలపురుషుడన్నారు. ఆయన బహుభాషా శాస్త్రవేత్త, చరిత్రకారుడు, సంఘసంస్కర్త, హేతువాది అని అన్నారు. మైనంపాటి కృషి బహుముఖీనమైందని, లలితకళలన్నింటిలో ఆరితేరిన ఆయన పద్యం, వచనం, గేయం, నాటకం, నాటిక, కథ, వ్యాసం మొదలైన ప్రక్రియల్లో 35కు పైగా రచనలు చేశారన్నారు. పెండ్లిమర్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకురాలు డా॥ రమ్యజ్యోతి మాట్లాడుతూ గిడుగుకు తాను నివసించే పర్లాకిమిడి దగ్గర అడవుల్లో ఉండే సవరల భాష నేర్చుకొని వాళ్ళకు చదువు చెప్పాలనే కోరిక కలిగిందన్నారు. తెలుగు, సవరభాషలు రెండూ వచ్చిన ఒక సవర వ్యవహర్తను ఇంట్లోనే పెట్టుకొని సవర భాష నేర్చుకున్నారన్నారు. సవర భాషలో పుస్తకాలు రాసి, సొంతడబ్బుతో బళ్ళు పెట్టి, అధ్యాపకుల జీతాలు చెల్లించి, సవరలకు వాళ్ళ భాషలోనే చదువు చెప్పే ఏర్పాట్లు చేశారన్నారు. విశ్రాంత తెలుగు పండితులు ఎస్.సుబ్బరాయుడు మాట్లాడుతూ గిడుగు విశిష్ట వ్యక్తిత్వాన్ని తెలియజేశారు. ఒడిషా రాష్ట్రం ఏర్పడే సమయంలో పర్లాకిమిడి రాజా తన పర్లాకిమిడి తాలూకా అంతటిని ఒడిషా రాష్ట్రంలో చేర్పించడానికి ప్రయత్నించినపుడు, తెలుగువారికి నాయకునిగా రామమూర్తి నిలిచి ప్రతిఘటించారన్నారు. తిరుపతికి చెందిన విశ్రాంత బ్యాంకు మేనేజర్ ఎం.ఎస్.దామోదర గుప్త సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రానికి రూ.10,000/ విరాళమిచ్చారు. ఈ కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డా॥ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, డా॥ చింతకుంట శివారెడ్డి, గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేష్‌రావు, జి.హరిభూషణరావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకట రమణ, ఎం.మౌనిక, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

## తమిళనాడు గవర్నర్ ను కలిసిన ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం



**లక్కిరెడ్డిపల్లి ఆగస్టు,29 ( మనసులోమాట):**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రివర్యులు శ్రీ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి తమిళనాడు గవర్నర్ గా నియమితులైన సందర్భంగా కిరణ్ కుమార్ రెడ్డి గారిని అన్నమయ్య జిల్లా ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం కలిసి శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు ఎం నరసింహులు మాట్లాడుతూ కిరణ్ కుమార్ రెడ్డి గారు గొప్ప రాజనీతిజ్ఞుడు, పరిపాలనదక్షుడు, ఆయనను తమిళనాడు గవర్నర్ గా నియమించడం సంతోషదాయకమని కొనియాడారు. జిల్లా మీడియా ఇన్చార్జ్ కరెడ్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో సుపరిపాలన అందించిన గొప్ప ముఖ్యమంత్రిగా ఆయనను కొనియాడారు. మీసేవ, రూపాయికి కిలో బియ్యం, రాష్ట్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం స్టేట్ మిల్క్ మిషన్, రైతులకు జీరో వడ్డీ రుణం, స్త్రీ నిధి మహిళా బ్యాంక్, 1.16 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్, ఇందిర జలప్రభ వంటి అద్భుతమైన పథకాలతో ప్రజారంజక పాలన అందించి ఉమ్మడి రాష్ట్ర విభజనను చివరి వరకు వ్యతిరేకించి పోరాడిన గొప్ప రాజకీయ నాయకుడిగా ప్రజల మనసులో నిలిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బాలాజీ, భూషణయ్య, మండల నాయకులు మధు, మల్లికార్జున, తోట రాజా తదితరులు పాల్గొన్నారు.

## రాజులపాలెం ఎస్టీ కాలనీలో టీడీపీ నేతల డోర్ టు డోర్ కార్యక్రమం



**ఏర్పేడు, ఆగష్టు 29 (మనసులో మాట) :**

ఏర్పేడు మండలం రాజులపాలెం ఎస్టీ కాలనీలో తెలుగుదేశం పార్టీ నాయకులు శనివారం డోర్ టు డోర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏర్పేడు మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు పేరం నాగరాజ నాయుడు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కాలనీలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలుసుకున్నారు.ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వారి ఇబ్బందులను నేరుగా విన్నారు. ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, స్థానికంగా ఉన్న సమస్యలు తదితర అంశాలపై వారితో చర్చించారు. ప్రజల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని టీడీపీ నాయకులు తెలిపారు. ప్రజలతో మమేకమవుతూ పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని నాయకులు కార్యకర్తలకు సూచించారు. కాలనీలో ప్రజల నుంచి నాయకులకు మంచి స్పందన లభించిందని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏర్పేడు మండల టీడీపీ నాయకులు రాఘవేంద్ర, గాలి క్రిష్ణవేణి, చంద్రశేఖర్ నాయుడు, జగదీష్, రాచేటి సుబ్రమణ్యం, గుణా యాదవ్, మునిరెడ్డి, చంద్ర, వై. మనోహర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త సీఐకు సీపీఎం నేతల శుభాకాంక్షలు

- ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలి: సీపీఎం

**ముదిగుబ్బ, ఆగస్టు 29: (మనసులో మాట):**

ముదిగుబ్బ అర్బన్ సీఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కె. రామసుబ్బయ్యను సీపీఎం నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ.. మండలంలో శాంతిభద్రతలను సమర్థవంతంగా పరిరక్షిస్తూ, సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేలా మెరుగైన పోలీసు సేవలు అందించాలని సీఐను కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పోలీసు శాఖకు తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పెద్దన్న, సీఐటీయూ మండల కార్యదర్శి బాబ్జాన్, ముస్తఫా, నౌషాద్, రహీమ్, పక్కిరప్ప తదితరులు పాల్గొన్నారు.



మనసులో మాట
KANCHARLA

# కుటుంబ సమస్యలకు ఫ్యామిలీ కౌన్సిలింగ్ కేంద్రాలే పరిష్కార వేదికలు






**ధర్మవరం ఆగస్టు 29 (మనసులో మాట):**

కుటుంబ సమస్యలు, దాంపత్య వివాదాలు, అపార్థాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించి కుటుంబాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పడమే ఫ్యామిలీ కౌన్సిలింగ్ కేంద్రాల ప్రధాన ఉద్దేశ్యమని అడిషనల్ ఎస్పీ అంకిత సురాన, ఐపీఎస్ తెలిపారు.జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్, ఐపీఎస్ ఆదేశాల మేరకు శనివారం ధర్మవరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లోని ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్‌ను అడిషనల్ ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి వారి కుటుంబ పరిస్థితులు, సమస్యలకు గల కారణాలను తెలుసుకున్నారు. ఫిర్యాదులను సున్నితంగా విని, ఇరుపక్షాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని నిష్పక్షపాతంగా కౌన్సిలింగ్ నిర్వహించాలని పోలీస్ అధికారులకు సూచించారు.

**కౌన్సిలింగ్‌తో ఒక్కటైన దంపతులు**

కుటుంబ వివాదాల కారణంగా 2026లో తులసి, సాయికుమార్ దంపతులు కోర్టు ద్వారా విడాకులు తీసుకున్నారు. అయితే పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తిరిగి ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్‌ను ఆశ్రయించారు. అడిషనల్ ఎస్పీ సమక్షంలో డీఎస్పీ జగన్నాథరావు, సీఐలు రెడ్డప్ప, జయనాయక్, కౌన్సిలింగ్ సెంటర్ ప్రతినిధులు ఇరువురితో మాట్లాడి కుటుంబ బంధాల విలువ, పిల్లల భవిష్యత్తు, పరస్పర అవగాహన ప్రాధాన్యతను వివరించారు. అనంతరం ఇరువురి అంగీకారంతో విడిపోయిన దంపతులు తిరిగి ఒక్కటయ్యారు.ఈ సందర్భంగా అంకిత సురాన మాట్లాడుతూ కుటుంబ సమస్యలు పెద్ద వివాదాలుగా మారకముందే ప్రారంభ దశలో పరిష్కరించుకోవడం ఉత్తమమన్నారు. కుటుంబ బంధాలు, ముఖ్యంగా పిల్లల భవిష్యత్తును ప్రతి ఒక్కరూ దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని సబ్‌డివిజన్లలో ఏర్పాటు చేసిన ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కౌన్సిలింగ్ ద్వారా కుటుంబ సమస్యల పరిష్కారానికి సేవలందిస్తున్న అధికారులు, న్యాయవాదులు, ప్రతినిధులు, సిబ్బందిని అడిషనల్ ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో డీఎస్పీ జగన్నాథరావు, సీఐలు రెడ్డప్ప, జయనాయక్, న్యాయవాదులు బాలసుందరి భార్గవి, చలపతి, రాఘవేంద్ర, గంగాభవాని, కౌన్సిలింగ్ సెంటర్ ప్రతినిధులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఐదు నెలలుగా వేతనాల్లేవు.. సెప్టెంబర్ 1 నుంచి సమ్మెకు సిద్ధం

- **శ్రీసత్యసాయి వాటర్ సప్లయ్ ప్రాజెక్టు కార్మికుల సమ్మె నోటీసు – తహసీల్దార్ కార్యాలయంలో సీపీఎం, సీఐటీయూ వినతి**

**ముదిగుబ్బ, ఆగస్టు 29: (మనసులో మాట):**

శ్రీసత్యసాయి వాటర్ సప్లయ్ ప్రాజెక్టు ద్వారా వందలాది గ్రామాలకు తాగునీటిని అందిస్తున్న 570 మంది కార్మికులకు గత ఐదు నెలలుగా బకాయి వేతనాలు చెల్లించకపోవడంపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం సీపీఎం, సీఐటీయూ నాయకులు, శ్రీసత్యసాయి వాటర్ సప్లయ్ కార్మికులు పంచాయతీ, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. ఐదు నెలలుగా వేతనాలు అందకపోవడంతో కార్మికులు, వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారం కోసం పలుమార్లు సంబంధిత ఎస్ఎస్ఎస్‌డబ్ల్యూఎస్‌పీ బోర్డు అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందించినప్పటికీ ఇప్పటి వరకు పరిష్కారం లభించలేదన్నారు.



**2021 నుంచి ఇదే పరిస్థితి**

2021 సంవత్సరం నుంచి ప్రాజెక్టులో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు సకాలంలో అందడం లేదని, ప్రతిసారీ వేతనాల కోసం ఆందోళనలు, సమ్మెలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు. ప్రాజెక్టు నిర్వహణకు అవసరమైన స్థాయిలో నిధులు కేటాయించకపోవడం వల్ల ఈ సమస్య పదేపదే పునరావృతమవుతోందని పేర్కొన్నారు. శ్రీసత్యసాయి బాబా ప్రజలకు తాగునీరు అందించాలనే సత్సంకల్పంతో ఏర్పాటైన ఈ పవిత్రమైన తాగునీటి ప్రాజెక్టుకు నిధుల కొరత, నిర్లక్ష్యం కారణంగా ఇలాంటి పరిస్థితి రావడం బాధాకరమన్నారు. ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందించే ఈ ప్రాజెక్టును కాపాడి, స్వామివారి ఆశయాన్ని కొనసాగించే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

**సెప్టెంబర్ 1 నుంచి విధుల బహిష్కరణ**

2026 ఆగస్టు 31లోపు 570 మంది కార్మికులకు ఐదు నెలల బకాయి వేతనాలను పూర్తిగా చెల్లించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిర్ణీత గడువులోగా బకాయి వేతనాలు చెల్లించని పక్షంలో సెప్టెంబర్ 1, 2026 నుంచి విధులు బహిష్కరించి సమ్మెలోకి వెళ్తామని ముందస్తుగా సమ్మె నోటీసు ద్వారా హెచ్చరించారు. అదేవిధంగా ప్రాజెక్టు నిరంతరాయంగా కొనసాగేందుకు ప్రతి ఏడాది అవసరమైన నిధులను ప్రభుత్వం ప్రత్యేకంగా కేటాయించి, కార్మికులకు సకాలంలో వేతనాలు అందేలా శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.



**కార్మికుల ప్రధాన డిమాండ్లు**

ఐదు నెలలుగా బకాయి ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలి. మరణించిన, పదవీ విరమణ చేసిన కార్మికులకు గ్రాట్యుటీ చెల్లించాలి. శ్రీసత్యసాయి వాటర్ సప్లయ్ ప్రాజెక్టుకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి.కార్మికుల సమస్యపై అధికారులు తక్షణమే స్పందించి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి 570 మంది కార్మికులకు న్యాయం చేయాలని సీపీఎం, సీఐటీయూ నాయకులు కోరారు. కార్యక్రమంలో శ్రీసత్యసాయి వాటర్ సప్లయ్ కార్మికులు, సీపీఎం, సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ వి విద్యామందిర్ హైస్కూల్‌లో ఘనంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలు



**రాయచోటి ఆగస్టు 29 మనసులో మాట:**

ఎస్ వి విద్యామందిర్ హైస్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తెలుగు భాష గొప్పతనాన్ని తెలియజేసే వివిధ కార్యక్రమాల్లో ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, తెలుగు భాష అభివృద్ధికి గిడుగు వెంకట రామమూర్తి చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. అప్పట్లో ప్రజలకు కష్టంగా ఉన్న గ్రాంథిక భాషకు బదులుగా అందరికీ సులభంగా అర్థమయ్యే వ్యావహారిక భాషను ప్రోత్సహించేందుకు గిడుగు వెంకట రామమూర్తి విశేషంగా కృషి చేశారని తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఆంగ్ల భాషను కూడా నేర్చుకోవడం ఎంతో అవసరమని, అయితే ఇతర భాషలను నేర్చుకుంటూనే మాతృభాష తెలుగును గౌరవించి, ప్రేమించాలని విద్యార్థులకు సూచించారు. తెలుగు భాషను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని తెలుగు భాష పట్ల తమ అభిమానాన్ని చాటుకున్నారు.

# అధికార పార్టీ కి కొమ్ము కాస్తున్న రెవెన్యూ అధికారులు

**వాకాడు మనసులో మాట అగస్ట్ 29:**



వాకాడు మండలం లో రెవిన్యూ అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ కల్లూరు మాజీ సర్పంచ్ దువ్వూరు విజయభాస్కర్ రెడ్డి శనివారం వాకాడుకు వచ్చిన వెంకటగిరి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త నేదురమల్లి రామ్ కుమార్ రెడ్డి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ముట్టెంబాక లో ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో భారీగా అవతవకలు జరుగుతున్న అధికారులకు ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నరన్నారు. ఎవ్వరు ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోవటం లేదన్నారు.వీఆర్వో పసుపు చొక్కా వేసుకుని టిడిపి నాయకుడులా వ్యవహరిస్తున్నాడన్నారు.ఆర్ ఐ నువ్వు వైసీపీ పార్టీ చెందిన వాడవు అంటున్నాడన్నారు. తాసిల్దారు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నాడన్నారు. వాకాడు లో వైసీపీ నాయకులకు అధికారులు ఎటువంటూ పనులు కూడా చేయడం లేదని వాపోయారు.మండలం వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులు పడుతుంటే మీరు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్ని రాంకుమార్ రెడ్డి వద్ద వాపోవడంతో స్పందిన వైసిపి సి ఈ సి సభ్యుడు కొడవలూరు భక్తవాసలం రెడ్డి జోక్యం చేసుకొని తాసిల్దార్ కు ఫోన్ చెసి రాం కుమార్ రెడ్డి మీతో మాట్లాడుతాడు అని ఫోన్ రాంకుమార్ రెడ్డి కి ఇవ్వడంతో ఆయన తాసిల్దార్ తో మాట్లాడారు. అధికారులు మండలం లో జరుగుతున్న అన్యాయ, అక్రమ అడ్డుకట్ట వేయకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని విజయభాస్కర్ రెడ్డి తెలిపారు.

# పలమనేరు సీఐ మోహన్ రెడ్డికి మహిళలు రక్షాబంధన్



**పలమనేరు ఆగస్టు 29( మనసులో మాట) :**
పలమనేరు అర్బన్ సీఐ మోహన్ రెడ్డికి శనివారం ఉదయం స్థానిక పోలీస్ స్టేషన్ నందు బ్రహ్మకుమారిస్ జ్యోతి ఆధ్వర్యంలో పలమనేరు అర్బన్ సిఐ మోహన్ రెడ్డి తో పాటు టిడిపి నాయకులు గంగమ్మ గుడి చైర్మన్ శ్రీధర్, జిల్లా మైనార్టీ అధ్యక్షులు కాజాపీర్, మదన్ మోహన్ గౌడ్ లకు బ్రహ్మకుమారి రక్షాబంధన్ కట్టిన్నారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టారు.

## రేడియో స్టేషన్ శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రావణ మాస మహోత్సవాలు





**కడప, మనసులో మాట, ఆగస్టు ,27:**
కడప పులివెందుల ప్రధాన రహదారి లో చింతకొమ్మదిన్నె మండలం శివాజీ నగర్ రేడియో టేషన్ ప్రక్కన వెలసిన శ్రీశ్రీశ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో మూడో శనివారం శ్రావణమాస మహోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి, ఉదయం వేద పండితులచే అభిషేక పూజలు ప్రత్యేక పూల అలంకరణ నిర్వహించారు, ఉదయం 6 గంటల నుంచి స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో పాటు సమీపంలో ఉన్న యోగివేమన విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ సిబ్బంది, కొప్పర్తి పారిశ్రామిక వాడ కార్మికులు స్వామివారి దర్శనం చేసుకున్నారు, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు, మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయ కమిటీ నిర్వాహకులు అన్న ప్రసాద వితరణ 2 గంటల వరకు నిర్వహించారు, వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలతో పాటు అన్నప్రసాద వితరణ తీసుకున్నారు.

# శ్రీశైలం నుంచి నెల్లూరు జలాశయాలకు నీరు విడుదల చేయాలి

- మాజీ మంత్రి కాకాణి



**నెల్లూరు, ప్రతినిధి, ఆగస్టు 29, మనసులో మాట:**
శ్రీశైలం జలాశయం నుంచి సోమశిల, కండలేరు జలాశయాలకు తక్షణమే నీటిని విడుదల చేసి నెల్లూరు జిల్లా రైతాంగాన్ని, ప్రజలను ఆదుకోవాలని మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డా. కాకాణి గోవర్ధన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నెల్లూరు లోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోమశిల, కండలేరు జలాశయాల్లో నీటి నిల్వలు వేగంగా తగ్గుతున్నప్పటికీ ప్రభుత్వం నీటి నిర్వహణపై చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని ఆరోపించారు. శ్రీశైలం జలాశయంలో సమృద్ధిగా నీరు ఉన్నప్పటికీ నెల్లూరు జిల్లాలోని ప్రధాన జలాశయాలకు నీటిని విడుదల చేయకపోవడం వల్ల రైతాంగం తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. కాకాణి వివరాల ప్రకారం, ఆగస్టు 29 ఉదయం 8 గంటల ప్రత్యక్ష గణాంకాల ప్రకారం శ్రీశైలం జలాశయం 215 టీఎంసీల సామర్థ్యానికి గాను 153.5 టీఎంసీల నీటి నిల్వతో 71 శాతం మేర ఉంది. శ్రీశైలం ప్రస్తుత నీటిమట్టం 872.80 అడుగులుగా ఉందన్నారు. మరోవైపు 78 టీఎంసీల సామర్థ్యం కలిగిన సోమశిలలో 20.64 టీఎంసీలు, 68 టీఎంసీల సామర్థ్యం కలిగిన కండలేరులో 20.15 టీఎంసీల నీరు మాత్రమే ఉందని తెలిపారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా శ్రీశైలం నుంచి నీటిని గ్రావిటీ ద్వారా తరలించే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం ఎందుకు నీటిని విడుదల చేయడం లేదని కాకాణి ప్రశ్నించారు. శ్రీశైలంలో నీటి లభ్యత ఉన్నప్పుడే సోమశిల, కండలేరు జలాశయాలను క్రమంగా నింపుకోవాలని, తద్వారా మొదటి పంటతో పాటు భవిష్యత్ తాగునీటి అవసరాలను కూడా తీర్చుకునే అవకాశం ఉంటుందని సూచించారు. ఎగువ ప్రాంతాల్లోని జూరాల, నారాయణపూర్ వంటి ప్రాజెక్టులు నిండిన నేపథ్యంలో వచ్చే వరద నీరంతా శ్రీశైలానికి చేరే అవకాశం ఉందని కాకాణి పేర్కొన్నారు. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో భారీ వర్షాలు వచ్చిన తర్వాత ఒక్కసారిగా నీటిని దిగువకు విడుదల చేస్తే ప్రయోజనం లేకుండా సముద్రం పాలయ్యే ప్రమాదం ఉందన్నారు. ముందస్తు చర్యగా నీటి అవసరాలను సమతుల్యం చేస్తూ నెల్లూరు, రాయలసీమ ప్రాంతాలకు సాగు, తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం శ్రీశైలం నీటిని విద్యుత్ ఉత్పత్తి, లిఫ్ట్ ఇరిగేషన్ అవసరాలకు వినియోగిస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని కాకాణి విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ రైతుల ప్రయోజనాలను పక్కన పెట్టి ఇతర రాష్ట్రాల ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. జిల్లాలో సాగునీటితో పాటు తాగునీటి సమస్య కూడా తీవ్రతరం అయ్యే అవకాశం ఉందని కాకాణి ఆందోళన వ్యక్తం చేశారు. జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గుతున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు, పశువులు తాగునీటి కోసం ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడవచ్చన్నారు. ప్రభుత్వం ముందస్తు కంటింజెన్సీ ప్రణాళిక రూపొందించి ప్రత్యామ్నాయ పంటలు, విత్తనాలు, పశుగ్రాసం, తాగునీటి సరఫరాపై దృష్టి పెట్టాలని కోరారు. ఇరిగేషన్ శాఖ నీటి నిర్వహణలో వైఫల్యం చెందిందని, రిజర్వాయర్ల నుంచి ఎంత నీటిని విడుదల చేశారు, దాని ద్వారా ఎంత పంట సాగైంది, ఎంత నీరు వృథా అయిందనే వివరాలపై ప్రభుత్వం స్పష్టమైన లెక్కలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జిల్లాలో నీటి పారుదల కంటే నిధుల పారుదలకే కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని కాకాణి ఆరోపించారు. సర్వేపల్లి రిజర్వాయర్‌కు అవసరం లేకపోయినా రూ.50 కోట్ల అదనపు నిధులు మంజూరు పేరుతో బిల్లులు డ్రా చేసుకునే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. జిల్లాకు చెందిన కూటమి ప్రజాప్రతినిధులు నీటి సమస్యపై ఎందుకు మాట్లాడటం లేదని కాకాణి ప్రశ్నించారు. చంద్రబాబు, లోకేష్‌లకు భయపడి వారు నోరు విప్పడం లేదని ఆరోపించారు. అయితే జిల్లా ప్రజలు, రైతాంగం సమస్యలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిశ్శబ్దంగా ఉండదని, రైతుల పక్షాన నిలబడి పోరాడుతుందని స్పష్టం చేశారు. వెంటనే జిల్లా స్థాయి సమీక్ష నిర్వహించాలి, జిల్లాలో సాగు, తాగునీటి పరిస్థితిపై ప్రభుత్వం వెంటనే జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించాలని కాకాణి డిమాండ్ చేశారు. శ్రీశైలం నుంచి సోమశిల, కండలేరు జలాశయాలకు తక్షణమే నీటిని విడుదల చేసి మొదటి పంటకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో జిల్లా ప్రజలు, రైతాంగం తరఫున వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటాన్ని ఉధృతం చేస్తుందని ఆయన హెచ్చరించారు.

# కడప డిఈఓ ఆఫీస్ లో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం







**చెన్నూరు, మనసులో మాట, ఆగస్టు, 29:**
జాతీయ క్రీడా దినోత్సవం కడప డీఈవో కార్యాలయంలో శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు , ధ్యాన్చంద్ జన్మదిన సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం జరుపుకుంటున్న సందర్భంలో ఎక్సలెన్సీ అవార్డ్స్ ఐదు పాఠశాలలకు ఇవ్వడం జరిగింది . ఇందులో భాగంగా మొదట మున్సిపల్ హై స్కూల్ గాంధీ నగర్, డైరెక్టర్ వెంక లక్ష్మి రెండవ స్థానంలో జడ్పీహెచ్ఎస్ నలుపు రెడ్డి పల్లి,గోవర్ధన్ రెడ్డి మూడో స్థానంలో జడ్పీహెచ్ఎస్ రామనపల్లి, పోలంకి గణేష్ బాబు గ నాలుగో స్థానంలో కేజీబీవీ అట్లూరు, ప్రమీల ఐదవ స్థానంలో జడ్పీహెచ్ఎస్ వి కొత్తలూరు, శ్రీకాంత్ రెడ్డి గారు పురస్కారాన్ని అందుకున్నారు. ఈ పురస్కారాన్ని డిప్యూటీడీవో రాజగోపాల్ రెడ్డి గారు సైన్స్ ఆఫీసర్ రెహమాన్ గారు ప్రతిభ అవార్డు సాధించినటువంటి ఐదు స్కూలు హెడ్ మాస్టర్ వాళ్ళ ఆధ్వర్యంలో జరుపుకోవడం జరిగింది . ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు హెడ్మాస్టర్లు పాల్గొన్నారు. ప్రతి గ్రామంలో కూడా క్రీడా స్థలం ఎన్నుకొని ప్రతి విద్యార్థి క్రీడా అభివృద్ధి కోసం ఆ క్రీడా స్థలంలో ప్రతిరోజు వ్యాయామము చేయడం వలన పిల్లలు మొదటి స్థాయి నుంచి అభివృద్ధి చెందుతారు జిల్లా స్థాయి రాష్ట్రస్థాయి జాతీయ స్థాయికి వెళ్లి ఒలంపిక్స్ లో పాల్గొనడానికి మెరుగైన అవకాశాలు ఉన్నాయని డిప్యూటీ డిఇఓ గారు రాజగోపాల్ రెడ్డి గారు అభిప్రాయ పడ్డారు. శ్రీకాంత్ రెడ్డి ఎస్ జి ఎఫ్ సెక్రటరీ, చంద్రావతి ఎస్ ఇ ఎఫ్ సెక్రెటరీ, ప్రవీణ్ కుమార్ స్టేట్ ఏపీపీఈటి మరియు పిడి అసోసియేషన్ సెక్రటరీ పలువురు పాల్గొన్నారు.

మనసులో మాట

# ఆహార నాణ్యతపై ఫుడ్ సేఫ్టీ అధికారుల కొరడా

- బుచ్చిరెడ్డిపాళెంలో ఆకస్మిక తనిఖీలు..
- 7 సంస్థలకు నోటీసులు.. 5 సంస్థలపై కేసులు



**నెల్లూరు/బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 29, మనసులో మాట:**

ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందించడమే లక్ష్యంగా ఫుడ్ సేఫ్టీ శాఖ అధికారులు బుచ్చిరెడ్డిపాళెం పరిధిలోని హోటళ్లు, దాబాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత, ఆహార భద్రతా ప్రమాణాలు, ఆహార భద్రత నిబంధనలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీల్లో పరిశుభ్రత ప్రమాణాలు సక్రమంగా పాటించని 7 ఆహార సంస్థలకు నోటీసులు జారీ చేయగా, ఆహార భద్రతా నిబంధనలు ఉల్లంఘించిన 5 సంస్థలపై కేసులు నమోదు చేశారు.

**అనర్హ ఆహార పదార్థాలు ధ్వంసం**

తనిఖీల సందర్భంగా కొన్ని సంస్థల్లో కృత్రిమ రంగులు కలిపిన చికెన్, పాడైపోయిన చికెన్, హాఫ్‌బాయిల్డ్ చపాతీలు, పరోటాలు, పాడైపోయిన కాలీఫ్లవర్ తదితర ఆహార పదార్థాలను గుర్తించారు. వినియోగానికి అనర్హమైన సుమారు 5 కిలోల కాలీఫ్లవర్‌తో పాటు ఇతర ఆహార పదార్థాలను అధికారులు ధ్వంసం చేశారు. అలాగే వేడి ఆహార పదార్థాలను పలుచటి పాలిథిన్ కవర్లలో ప్యాక్ చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించిన అధికారులు సుమారు 15 కిలోల ఆహార పదార్థాలను ప్యాక్ చేసిన పలుచటి పాలిథిన్ కవర్లను ధ్వంసం చేశారు. ఇకపై 120 మైక్రాన్లకు పైబడిన కవర్లను మాత్రమే వినియోగించాలని వ్యాపారులను ఆదేశించారు.

**పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి**

ప్రతి ఆహార సంస్థలో ఆహార భద్రత లైసెన్సును గోడపై స్పష్టంగా ప్రదర్శించాలని అధికారులు సూచించారు. హోటల్ పరిసరాలు, స్టాళ్లు, వంటగదులను పరిశుభ్రంగా ఉంచాలని, వంటగదిని ప్రతిరోజూ శుభ్రం చేయడంతో పాటు వారానికి ఒకసారి పెస్ట్ కంట్రోల్ నిర్వహించి సంబంధిత ధ్రువపత్రాలను భద్రపరచాలని తెలిపారు. ప్రతి సంవత్సరం వంటగదికి పెయింటింగ్ చేయించుకోవాలని సూచించారు. చట్నీ, కారం తదితరాలను ఫ్రిజ్‌లో నిల్వ చేయకుండా తాజాగా తయారు చేయాలని, పాడైపోయిన కూరగాయలు, మాంసం వినియోగించరాదని స్పష్టం చేశారు. బిరియాని, టమాటా రైస్, లెమన్ రైస్, పుదీనా రైస్, గోబీ తదితర ఆహార పదార్థాల్లో కృత్రిమ రంగులు, అజినమోటో వినియోగించకూడదని హెచ్చరించారు.

**ఆహార నిల్వలో నిబంధనలు తప్పనిసరి**

ముడి పదార్థాలను గాలి, దుమ్ము తగలకుండా మూత ఉన్న కంటైనర్లలో నిల్వ చేయాలని, ఆహార భద్రత శాఖ విధానాలను పాటించాలని అధికారులు సూచించారు. ఫ్రిజ్‌లను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు వారానికి ఒకసారి డీఫ్రాస్ట్ చేయాలని, వారానికి ఒకసారి డీప్ క్లీనింగ్ నిర్వహించాలని తెలిపారు. వంట నూనెను రెండుసార్లకు మించి డీప్‌ఫ్రైకి వినియోగించరాదని, ఉపయోగించిన వంట నూనెను సేకరించే వారికి అప్పగించాలని సూచించారు. వండిన ఆహారాన్ని 60 డిగ్రీల సెల్సియస్ వద్ద వేడిగా ఉండేలా తగిన పరికరాలను వినియోగించాలని, చల్లబడిన ఆహారాన్ని విక్రయించరాదని స్పష్టం చేశారు. ఆహారం వడ్డించే సిబ్బంది తప్పనిసరిగా హెడ్ క్యాప్స్, గ్లౌవ్స్, ఏప్రాన్లు ధరించాలని, ఆహారాన్ని కప్పేందుకు న్యూస్‌పేపర్‌ను ఉపయోగించరాదని, బటర్ పేపర్‌ను మాత్రమే వినియోగించాలని ఆదేశించారు. తయారైన ఆహార పదార్థాలను దుమ్ము, ధూళి పడకుండా గ్లాస్ బాక్సులు లేదా తగిన రక్షణతో ఉంచాలని సూచించారు.



**నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు**

బుచ్చిరెడ్డిపాళెం పరిధిలోని హోటళ్లు, దాబాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, ఇతర ఆహార సంస్థలపై ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఫుడ్ సేఫ్టీ అధికారులు తెలిపారు. ఆహార వ్యాపారులు తప్పనిసరిగా పరిశుభ్రత, ఆహార భద్రతా ప్రమాణాలను పాటిస్తూ నాణ్యమైన ఆహారాన్ని మాత్రమే వినియోగదారులకు అందించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఫుడ్ సేఫ్టీ కంట్రోలర్ జి వెంకటేశ్వరరావు, ఫుడ్ సేఫ్టీ అధికారులు డా డి నీరజ, ఎం ప్రణుతి ఫ్లోరా పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతకు ప్రాధాన్యం – జిల్లా వ్యాప్తంగా "ఫేస్ వాష్ అండ్ గో" కార్యక్రమం

**నెల్లూరు జిల్లా బ్యూరో, ఆగష్టు 29(మనసులో మాట):**

జాతీయ, రాష్ట్ర రహదారులపై రాత్రి వేళల్లో జరిగే రోడ్డు ప్రమాదాలను నివారించి, డ్రైవర్లలో అప్రమత్తత పెంపొందించేందుకు జిల్లా వ్యాప్తంగా "ఫేస్ వాష్ అండ్ గో" ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ డా. అజిత వెజెండ్ల ఐపీఎస్ తెలిపారు. రాత్రి సమయంలో అలసట, నిద్రమత్తుతో వాహనాలు నడిపే డ్రైవర్లను సురక్షిత ప్రదేశాల్లో ఆపించి ముఖం కడుక్కోవడం, తాగునీరు సేవించడం, కొద్దిసేపు విశ్రాంతి తీసుకోవడం వంటి సూచనలు చేస్తూ అన్ని హైవేలపై ముఖ్యమైన పాయింట్స్ వద్ద అవగాహన కల్పించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా వాహన భద్రతా పరికరాల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్, అతివేగం నియంత్రణ చర్యలు మరియు ట్రాఫిక్ నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. అలాగే అక్రమ రవాణా, నేర కార్యకలాపాల నివారణ కోసం వాహనాలు, అనుమానిత వ్యక్తులపై తనిఖీలు కొనసాగుతున్నాయి. ప్రజలు అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు లేదా కార్యకలాపాలను గమనించిన వెంటనే డయల్ 112, పోలీస్ కంట్రోల్ రూమ్: +91 93929 03413 సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని జిల్లా పోలీసు శాఖ విజ్ఞప్తి చేసింది.




# జడ్పీహెచ్ఎస్ రామన్నపల్లిలో తెలుగు, క్రీడా దినోత్సవ వేడుకలు



**చెన్నూరు, మనసులో మాట, ఆగస్టు ,29:**

చెన్నూరు మండలం రామన్న పల్లె లోని జిల్లా పరిషత్ హై స్కూల్ నందు శనివారం క్రీడా దినోత్సవాన్ని మరియు తెలుగు దినోత్సవాన్ని పురస్కరించుకుని హెడ్మాస్టర్ ఉమామహేశ్వరి గారు మరియు ఫిజికల్ డైరెక్టర్ గణేష్ బాబు మరియు తెలుగు ఉపాధ్యాయుడు బాబాయ్ మహేశ్వర్ రెడ్డి సుబ్బారెడ్డి గారు దుర్గా సుశీల మరియు కాంప్లెక్స్ మీటింగ్కు విచ్చేసినటువంటి ఉపాధ్యాయులందరూ పాల్గొనడం మరియు పిల్లలు పాల్గొనడం జరిగింది. తెలుగు భాష నందు గిడుగు రామ్మూర్తి గారు చేసిన సేవను పిల్లలకు తెలియజేయడం జరిగింది. అదేవిధంగా ధ్యాన్చంద్ గారు క్రీడారంగంలో చేసినటువంటి కృషి పిల్లలందరికీ తెలియజేయడం జరిగింది. వీరి ఇరువురిని కూడా పిల్లలు ఆదర్శంగా తీసుకొని రాబోయే భవిష్యత్తులో ఉజ్వల బాట వేస్తూ ముందంజలోకి వెళ్లాలని ఫిజికల్ డైరెక్టర్ గణేష్ బాబు మరియు తెలుగు భాష పండితుడు బాబాయ్య గారు పేర్కొన్నారు.

# విద్యార్థులు మొబైల్‌లో కాదు, మైదానాల్లోనే ఆటలు ఆడాలి: డీఈఓ కె.వి.ఎన్. కుమార్



**శ్రీకాళహస్తి, ఆగష్టు 29 (మనసులో మాట) :**

శ్రీకాళహస్తిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా క్రీడా ప్రతిభా అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (SGF) తిరుపతి జిల్లా సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖాధికారి కె.వి.ఎన్. కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో ఆరోగ్యం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లలో గేమ్స్ ఆడటానికి పరిమితం కాకుండా మైదానాల్లో ఆటలు ఆడాలని సూచించారు. మేజర్ ధ్యాన్‌చంద్ వంటి క్రీడా దిగ్గజాల స్ఫూర్తితో విద్యార్థులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడా ప్రతిభను పాఠశాల స్థాయిలోనే గుర్తించి సరైన శిక్షణ, ప్రోత్సాహం అందించాలని ఫిజికల్ డైరెక్టర్లు, వ్యాయామ ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థి క్రీడాకారులకు మెడల్స్, షీల్డ్స్, ప్రశంసాపత్రాలు అందజేసి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎస్ జి ఎఫ్ సెక్రటరీ కిషోర్, ఎంఈఓ బాలయ్య, తిరుపతి జిల్లా అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శి భార్గవి, ప్రధానోపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థి క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

మనసులోమాట

## డీవైఎఫ్ఐ 16వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



- బద్వేలు నాయకులు పిలుపు.

**బద్వేలు, మనసులో మాట,ఆగస్టు 29:**

వైఎఫ్ఐ 16వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ బద్వేలు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.కె. మస్తాన్ షరీఫ్, ఎస్.కె. ఆదిల్ పిలుపునిచ్చారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య రాష్ట్ర మహాసభలు సెప్టెంబర్ 1,2,3 తేదీలలో నెల్లూరులో జరగనున్నాయని, యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువత సమస్యలు, ఖాళీ పోస్టుల భర్తీ, నిరుద్యోగ భృతి, స్థానిక పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి, కడప ఉక్కు పరిశ్రమ నిధుల విడుదల వంటి అంశాలపై మహాసభల్లో చర్చించి కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఇచ్చిన హామీలను విస్మరించాయని విమర్శించారు. కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు ప్రసాద్ రెడ్డి, ఎస్.కె. షబ్బీర్, సహాయ కార్యదర్శి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## బద్వేలు ఆర్టీసీ బస్సులో రూ.1.10 లక్షలు



**బద్వేలు, మనసులో మాట,ఆగస్టు 29:**

అట్లూరు మండలం ఆకుతోటపల్లెకు చెందిన అరవ శారదమ్మ బ్యాగ్‌లో నుంచి రూ.1.10 లక్షల నగదు చోరీకి గురైంది. వివరాల ప్రకారం.. బంగారం విడిపించేందుకు రూ.3 లక్షల నగదుతో బ్యాంకుకు వెళ్లేందుకు శారదమ్మ బయలుదేరారు. అట్లూరు క్రాస్ రోడ్డులో బద్వేలు వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కారు. బస్సు బద్వేలు బస్టాండ్‌కు చేరుకునేలోపు తన బ్యాగ్‌లోని రూ.1.10 లక్షల నగదు కనిపించకపోవడంతో శారదమ్మ ఆందోళనకు గురయ్యారు. వెంటనే భర్తతో కలిసి బద్వేలు అర్బన్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నగదు చోరీ జరిగిన సమయంలో బస్సులో ఉన్న ప్రయాణికులు, పరిసర ప్రాంతాల్లోని వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. నిందితులను గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగుతోంది.

## ఉదయగిరిలో అభివృద్ధి పరుగులు.. మారుమూల గ్రామాలకు 4జీ, 5జీ సేవలు





- రూ.34 కోట్లతో 34 మొబైల్ టవర్లు
- జనార్ధనపురంలో టవర్ నిర్మాణానికి శంకుస్థాపన
- నర్రవాడలో శ్రీ వెంగమాంబ పేరంటాల అమ్మవారిని దర్శించుకున్న మంత్రులు ఫరూఖ్, వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే కాకర్ల

**నెల్లూరు/ఉదయగిరి, ఆగస్టు 29, మనసులో మాట:**

ఉదయగిరి నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగవంతం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని నెల్లూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండి ఫరూఖ్, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. నియోజకవర్గ పర్యటనలో భాగంగా వారు పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

**శ్రీ వెంగమాంబ పేరంటాల అమ్మవారికి ప్రత్యేక పూజలు**

దుత్తలూరు మండలం నర్రవాడలో కొలువై ఉన్న శ్రీ వెంగమాంబ పేరంటాల అమ్మవారిని మంత్రులు ఎన్ఎండి ఫరూఖ్, వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే కాకర్ల సురేష్, మాజీ ఎమ్మెల్యే కంభం రామిరెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ చెంచల్ బాబు యాదవ్ దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రులు, ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయగిరి నియోజకవర్గ ప్రజలందరిపై అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని వారు ప్రార్థించారు. నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అనంతరం నర్రవాడలో నిర్వహించిన ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. పేదలు, రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, వృద్ధులు సహా అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడంతో పాటు ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

**మారుమూల గ్రామాలకు 4జీ, 5జీ వెలుగులు**

ఉదయగిరి నియోజకవర్గంలో డిజిటల్ కనెక్టివిటీని మెరుగుపరిచే దిశగా మరో కీలక అడుగు పడింది. వింజమూరు మండలం జనార్ధనపురం గ్రామ పంచాయతీలో సుమారు రూ.కోటి వ్యయంతో నిర్మించనున్న బీఎస్ఎన్ఎల్ అత్యాధునిక 4జీ, 5జీ మొబైల్ టవర్ నిర్మాణ పనులకు మంత్రులు ఫరూఖ్, వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహకారంతో ఉదయగిరి నియోజకవర్గ టెలికాం అడ్వైజరీ డైరెక్టర్ తాటికొండ అనూష కృషితో నియోజకవర్గంలో రూ.34 కోట్ల వ్యయంతో 34 మొబైల్ టవర్ల నిర్మాణానికి అనుమతులు పొందినట్లు తెలిపారు. ఇందులో 21 టవర్లకు ఇప్పటికే పూర్తిస్థాయి అనుమతులు లభించాయని, వాటి నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయనున్నట్లు వెల్లడించారు. మారుమూల గ్రామాల్లో మొబైల్ సిగ్నల్, ఇంటర్నెట్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ఈ టవర్ల ఏర్పాటు కీలకంగా నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వేగవంతమైన ఇంటర్నెట్ సేవలతో విద్యార్థులు, యువత, రైతులు, వ్యాపారులు, ఉద్యోగులు, సామాన్య ప్రజలకు డిజిటల్ సేవలు మరింత అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ చెంచల్ బాబు యాదవ్, ఉదయగిరి నియోజకవర్గ అబ్జర్వర్ మీగడ ఓబులరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గంజాం రాఘవేంద్ర, మాజీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, ఎనిమిది మండలాల కన్వీనర్లు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గూడూరులో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకుల సమావేశం



**గూడూరు,ఆగస్టు29(మనసులో మాట ):**

గూడూరు పట్టణంలో తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలగురువం బాబు ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షులు షేక్ నాయకుల ఫయాజ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ మైనార్టీ నాయకుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర, జిల్లా స్థాయి కాంగ్రెస్ నాయకులు పాల్గొని మైనార్టీల సమస్యలు, రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ నవాబ్ జాకిర్ హుస్సేన్ మాట్లాడుతూ రాష్ట్రంలో మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. మైనార్టీల హక్కులు, విద్య, ఉపాధి, సంక్షేమ పథకాల అమలుపై కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాల గురువం బాబు మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం కులాలు, మతాల పేరుతో ప్రజల మధ్య విభజన తీసుకువస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో కూడా కుల రాజకీయాలకు ప్రాధాన్యం పెరుగుతోందని విమర్శించారు. ప్రజల మధ్య ఐక్యతను కాపాడుతూ అన్ని వర్గాలకు సమాన న్యాయం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. మైనార్టీలు, బడుగు బలహీన వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలపై కాంగ్రెస్ పార్టీ ప్రజల తరఫున నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీని బలోపేతం చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర మైనారిటీ వైస్ ప్రెసిడెంట్ డా.షేక్ బాషా,రాష్ట్ర మైనారిటీ జనరల్ సెక్రటరీ గుంతకల్లు యూసఫ్,రాష్ట్ర నాయకులు పంట శ్రీనివాసులు రెడ్డి ,పూల చంద్ర శేఖర్, తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ కరిముల్లా,తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రమేష్ రెడ్డి, తిరుపతి జిల్లా మైనార్టీ వైస్ ప్రెసిడెంట్ రాజిక్, తిరుపతి జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు స్వరూప్ నాయక్,గూడూరు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండి గౌస్ బాషా, గూడూరు పట్టణ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ ఇబ్రహీం, గూడూరు పట్టణ లీగల్ సెల్ అధ్యక్షులు రషీద్, తిరుపతి పార్లమెంటు పరిధిలోని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తి అమ్మాయికి స్వర్ణ పతకం



**శ్రీకాళహస్తి, ఆగస్టు 29 (మనసులో మాట) :**

తిరుపతిలో శనివారం నిర్వహించిన అమరావతి ఛాంపియన్‌షిప్ ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి ఎం. రాంప్రసాద్ రెడ్డి, శాప్ చైర్మన్ రవినాయుడు, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ పోటీల్లో శ్రీకాళహస్తికి చెందిన పత్తి నిత్య హాసిని అద్భుత ప్రతిభ కనబరిచింది. అండర్-17 బాలికల షాట్‌పుట్ విభాగంలో స్వర్ణ పతకం సాధించింది. ముఖ్య అతిథుల చేతుల మీదుగా నిత్య హాసిని గోల్డ్ మెడల్ అందుకుంది. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్న పాత్రుడు, మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఆమెను ప్రత్యేకంగా అభినందించారు.రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తాచాటి శ్రీకాళహస్తి పేరు నిలబెట్టిన నిత్య హాసినిపై తల్లిదండ్రులు, క్రీడాభిమానులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

## విద్యా ప్రస్థాన వేడుకలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

**పలమనేరు ఆగస్టు 29( మనసులో మాట) :**



పలమనేరు మండలంలోని మండిపేట కోటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వచ్చే నెల 6 న జరగనున్న విద్యా ప్రస్థాన (రూబీ జూబ్లీ వేడుక) వేడుకలకు విచ్చేయాలని నిర్వహకులు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని ఆహ్వానించారు. పలమనేరు తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యేను కలసిన ఆ పాఠశాల పూర్వపు విద్యార్థులు గ్రామస్థులు ఎమ్మెల్యేను కలిసి ఆహ్వానించారు. మండిపేట కోటూరు నందు జిల్లా పరిషత్ హైస్కూల్ ఏర్పాటు కాబడి 40 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు వారి పేర్కొన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల సమావేశము, ఉపాధ్యాయుల సత్కారము ,సాంస్కృతి కార్యక్రమాలతో పాటు పాఠశాల అభివృద్ధి కార్యక్రమాలు ప్రత్యేక అతిధుల ప్రసంగాలతో పాటు పలు కార్యక్రమాలు నిర్వహించునున్నట్లు వారు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేయాలని వారు ఆయన్ను కోరారు. ఈ కార్యక్రమంలో బాలాజీ కోఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్వీ బాలాజీ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జగదీష్ నాయుడు, మోహన్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## బైనాను పరామర్శించిన మెట్ట

**ముత్తుకూరు. ఆగష్టు.29(మనసులో మాట)**

ముత్తుకూరు వైసిపి ఎస్సీ నాయకులు బైన రామయ్యను అపార్టీ మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్ రెడ్డి పరామర్శించారు. బైన రామయ్య ఇటీవల కంటి ఆపరేషన్ చేయించుకుని ముత్తుకూరు లోని దళిత వడలు తన ఇంటి వద్ద ఉంటున్నాడు. దీంతో శనివారం మండల పార్టీ కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్ రెడ్డి, ఆ పార్టీ ముత్తుకూరు నాయకులు ఈదురు శ్రీనివాసుల రెడ్డి, దేవా రెడ్డి అశోక్ కుమార్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు, నాయకులు మోరాల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యులు నవీద్ భాషా, తదితరులు పాల్గొన్నారు. బైన రామయ్య ను ఆరోగ్యం పై అశ్రద్ధ వహించవద్దని జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందని ఆయనకు మెట్ట విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు.

# బ్రహ్మ దేవం స్కూల్లో తెలుగు భాషా దినోత్సవం

**ముత్తుకూరు. ఆగష్టు.29(మనసులో మాట)**



మండలంలోని బ్రహ్మదేవం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారంతెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బ్రహ్మదేవం నందు ఆగస్టు 29, 2026న తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్. టాన్యా మేడం అధ్యక్షతన ఈ కార్యక్రమం ఉత్సాహభరితంగా జరిగింది.

తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలుగు ఉపాధ్యాయులు కొండా మురళి , ఏ. శైలజ , కృష్ణకుమారి, చెంచు ప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, వేషధారణలు నిర్వహించారు.

ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన తెలుగు తల్లి వేషధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే తెలుగు భాష కోసం విశేష కృషి చేసిన గిడుగు వెంకట రామమూర్తి పంతులు గారి వేషధారణ విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంది. ప్రముఖ కవయిత్రి మొల్ల వేషధారణ కూడా అందరినీ అలరించింది.

ముఖ్యంగా శ్రీకృష్ణదేవరాయల వేషధారణతో పాటు అష్టదిగ్గజ కవుల వేషధారణలు విద్యార్థుల్లో తెలుగు సాహిత్యంపై ఆసక్తిని పెంచాయి. విద్యార్థులు ఆయా మహనీయుల పాత్రలను చక్కగా పోషిస్తూ, వారి గొప్పతనాన్ని తమ ప్రదర్శనల ద్వారా తెలియజేశారు.తెలుగు భాష గొప్పతనం, తెలుగు సాహిత్య వైభవం, తెలుగు భాషాభిమానాన్ని విద్యార్థుల్లో పెంపొందించే విధంగా నిర్వహించిన ఈ తెలుగు భాషా ఉత్సవాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన విద్యార్థులను, ఉపాధ్యాయులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు అభినందనలు తెలిపారు.దేశ భాషలందు తెలుగు లెస్స - తెలుగు భాష మనందరి గర్వకారణంఅనే సందేశంతో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఉత్సాహంగా ముగిశాయి.





# నెల్లూరు ప్రజలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం

- రూ.3 కోట్ల విలువైన మొబైల్ వ్యాన్‌తో ఇంటి వద్దకే వైద్య సేవలు..
- 12,200 మందికి ఉచిత కంటి పరీక్షలు

**నెల్లూరు, ప్రతినిధి, ఆగస్టు, మనసులో మాట:**

పేద, మధ్యతరగతి ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను ఉచితంగా అందించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న నారాయణ నేత్ర జ్యోతి, నారాయణ దంత సురక్ష ఉచిత వైద్య శిబిరాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. నెల్లూరు నగరంలోని 7వ డివిజన్ స్టోన్‌హౌస్‌పేటలోని బీవీఎస్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో ఉచిత కంటి, దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ పొంగూరు నారాయణ సొంత నిధులతో సుమారు రూ.3 కోట్ల విలువైన ఆధునిక వైద్య పరికరాలతో కూడిన మొబైల్ వ్యాన్ ద్వారా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల చెంతకే కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను తీసుకెళ్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శిబిరంలో ప్రజలకు ఉచిత కంటి, దంత పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి వైద్య



సలహాలు అందించారు. నారాయణ హాస్పిటల్స్ కంటి విభాగం ప్రొఫెసర్ డాక్టర్ సుధా, స్థానిక డివిజన్ కార్పొరేటర్ మల్యాద్రి మాట్లాడుతూ ప్రజల రోజువారీ పనులకు ఇబ్బంది కలగకుండా ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలతో పాటు పాఠశాలల్లోనూ సీనియర్ వైద్యులతో ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు 12,200 మందికి పైగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించగా, పరీక్షలు పూర్తయిన రెండు రోజుల్లోనే 6,900 మందికి పైగా నాణ్యమైన కంటి అద్దాలను ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. అలాగే 250 మందికి పైగా క్యాటరాక్ట్ శస్త్రచికిత్సలను ఉచితంగా విజయవంతంగా నిర్వహించినట్లు వెల్లడించారు. శిబిరంలో బీవీఎస్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు, యువతకు నేత్రదానం విశిష్టతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిన్న వయస్సు నుంచే నేత్రదానంపై అవగాహన పెంపొందించుకోవాలని వైద్యులు సూచించారు. అంధత్వ నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా డయాబెటిక్ రెటినోపతి, గ్లాకోమా వంటి దీర్ఘకాలిక కంటి సమస్యలపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. కంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స పొందడం ద్వారా చూపును కాపాడుకోవచ్చని వైద్యులు వివరించారు. రూపాయి ఖర్చు లేకుండా అందుబాటులోకి వస్తున్న ఈ కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ జనరల్ శేఖర్ రెడ్డి, కిన్నెర సాగర్‌తో పాటు స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వైద్య సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

## వి రామాపురం ఎలిమెంటరీ స్కూల్లో పాములు

**భయభ్రాంతులకు గురవుతున్న విద్యార్థులు**

గంగవరం ఆగస్టు 29( మనసులో మాట): గంగవరం మండలంలోనివి.రామాపురం వద్ద ఉన్న ఎలిమెంటరీ స్కూల్లో గత మూడు నెలలుగా పాముల బెడదతో విద్యార్థులు భయభ్రాంతులకు గురి అవుతున్న విద్యార్థులు

పాఠశాలకు వెళ్లాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారని తల్లిదండ్రులు వాపోయారు. వివరాల్లోకి వెళితే: మా స్కూల్లో మూడు నెలలుగా పాములు ఉన్నాయని స్కూల్ టీచర్ కు తెలిపారు. కానీ పట్టించుకోకుండా పోవడంతో భయభ్రాంతులకు గురి అవుతున్న విద్యార్థులు తెలిపారు. ఈ విషయంపై ఎంఈఓ వేణుగోపాల్ రెడ్డిని వివరణ కోరగా... పాఠశాల లోకి ఒక చిన్న పాము పిల్ల వచ్చిందని తనకు టీచర్ తెలపగా వెంటనే ఎంఈఓ 2 శ్రీనివాసులను పాఠశాల వద్దకు వెళ్ళమని చెప్పడం జరిగింది. ఆ పాము పిల్లను పాములు పట్టే వారిని పిలిపించి పట్టి వేయడం జరుగుతుందని ఎంఈఓ వేణుగోపాల్ తెలిపారు.



# తమలపాకుల అలంకరణ లో స్వయంభూ శ్రీలక్ష్మీనరసింహస్వామి

**బద్వేలు, మనసులో మాట, ఆగస్టు 29:**



బద్వేలు నియోజకవర్గంలోని గోపవరం మండలం వల్లేరవారి పల్లె గ్రామం లో వెలసిన స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామికి శ్రావణ మాస పూజాభిషేకాలను హోమం అంగరంగ వైభవంగా శనివారం నిర్వహించడం జరిగింది,స్వామి అమ్మ వారికి, తమలపాకులతో ప్రత్యేక అలంకరణ కార్యక్రమాన్ని చేశారు,ప్రత్యేక అలంకరణలో ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని భక్తులు కన్నుల పండుగ దర్శించుకున్నారు,అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు మాట్లాడుతూ 05/08/2026 తేదీన శ్రావణ మాసం చివరి శనివారం సందర్భంగా స్వామివారికి శాఖంబరి అలంకరణ ఉంటుంది అన్ని ప్రతి ఒక్కరు స్వామి వారి శాఖంబరి అలంకరణలో దర్శనం చేసుకోవటం వలన పూర్వ జన్మ పితృ శాపాలు తొలగిపోతాయి అన్ని అలాగే ఎంతో మంది సాదువుల,సద్గురువుల, మరియు వేద పాన్ డిత్యము కలిగిన గురువు లా ఆశీర్వాదం ఉంటుంది అది ఎందుచెత అంటే ప్రతి గురువు సాదువులు నరసింహ స్వామి ఆరాధనతో వాళ్లు చేసే ధ్యానం కి సాధన కి స్వామి వారి సంపూర్ణ అనుగ్రహం ఉంటుంది వారి రూపాలను పలు కూరగాయలో రూపం లో ఉంచి ఆలా స్వామి వారికి సేవ గా భావిస్తారు అన్ని పూరణాలు తెలుపుతూ ఉన్నాయి, కావున ప్రతి ఒక్కరు సకుటుంబ సమేతంగా పాల్గొని స్వామి వారి సంపూర్ణ ఆశీర్వాదం పొందగలరు అని మనవి 28 తేదిన హీరో సుమన్ తల్వార్ జన్మదినమును పురస్కరించుకొని శనివారం రోజున లక్ష్మి నరసింహ స్వామి కుటుంబం సభ్యుల ఆధ్వర్యంలో స్వామి దర్శనం అన్న ప్రసాద కైంకర్యం నిర్వహించడం జరిగినది తదుపరి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదములు అందించడం జరిగినది,ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.



# మీకు నచ్చిన క్రీడల్లో రాణించండి..




- **ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్....**

**చిత్తూరు ,ఆగస్టు 29, (మనసులో మాట):-**

మీకు నచ్చిన క్రీడల్లో రాణించాలని, క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని శనివారం చిత్తూరు డిస్టిక్ ఒలంపిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ కార్యక్రమంలో ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పీసీఆర్ సర్కిల్ నుండి ఎమ్మెస్సార్ సర్కిల్, చర్చి వీధి మీదుగా క్రీడాకారులు, విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం పీసీఆర్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కూటమి ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. క్రీడల్లో రాణించిన విద్యార్థులను సత్కరించారు. అంతకుముందు మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డీఈవో లక్ష్మీనారాయణ, చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, చిత్తూరు జిల్లా ఒలంపిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు జయప్రకాష్, రాజేష్ కుమార్ రెడ్డి, సతీష్, రవీంద్ర నాయుడు, యువరాజులు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు, బాలబాలికల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం

**బత్తలపల్లి ఆగస్టు 29 (మనసులో మాట)**




మహిళలు, బాలబాలికల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని అడిషనల్ ఎస్పీ అంకిత సురాన, ఐపీఎస్ అన్నారు. జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్, ఐపీఎస్ ఆదేశాల మేరకు బత్తలపల్లి మండలం ఈదుల ముస్తూరు గ్రామంలో మహిళలు, బాలబాలికల భద్రత, చట్టాలు, సైబర్ నేరాలు, బాల్యవివాహాలు, సోషల్ మీడియా వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమానికి అడిషనల్ ఎస్పీ అంకిత సురాన, ధర్మవరం డీఎస్పీ జగన్నాథ రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అంకిత సురాన మాట్లాడుతూ మహిళలు, బాలబాలికలకు కల్పిస్తున్న హక్కులు, రక్షణ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. సమస్యలు ఎదురైనప్పుడు భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, అపరిచితులతో వ్యక్తిగత వివరాలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు, ఫొటోలు పంచుకోరాదన్నారు. అనుమానాస్పద లింకులు, సందేశాలు, ఫోన్‌కాల్స్‌కు స్పందించకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాల్యవివాహాల నివారణకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. మహిళలు, బాలికల భద్రత కోసం శక్తి యాప్‌ను వినియోగించుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112, మహిళల సహాయం కోసం 181, సైబర్ నేరాలపై సైబర్ క్రైమ్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణ, ఏకాగ్రతతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, తాత్కాలిక ఆకర్షణలకు లోనుకాకుండా భవిష్యత్తుపై దృష్టి సారించాలని హితవు పలికారు. డీఎస్పీ జగన్నాథ రాజు మాట్లాడుతూ మహిళలు, బాలబాలికల భద్రత పోలీస్ శాఖ ముఖ్య ఉద్దేశమన్నారు. విద్యతో పాటు సమాజం పట్ల బాధ్యత కలిగి ఉంటే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు.అనంతరం విద్యార్థులు అడిగిన సందేహాలకు అధికారులు సమాధానాలు ఇచ్చారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా ద్వారా కలిగే అనర్థాలను ప్రొజెక్టర్ ద్వారా వివరించారు.కార్యక్రమంలో సీఐ ప్రభాకర్, ఎస్సై సోమశేఖర్ యాదవ్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఐసీడీఎస్, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## గిరిజన విద్యార్థులకు నాణ్యమైన ప్లేట్లు, గ్లాసుల పంపిణీ

**శ్రీకాళహస్తి, ఆగష్టు 29 (మనసులో మాట) :**



శ్రీకాళహస్తి పట్టణంలోని లంక మిట్ట ప్రాంతంలో ఒకటి నుంచి ఏడో తరగతి వరకు చదువుతున్న గిరిజన విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రముఖ సంఘ సేవకులు డాక్టర్ యల్లంపాటి కోటేశ్వర బాబు సేవా కార్యక్రమం చేపట్టారు.

మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు అందించే భోజనాన్ని సౌకర్యవంతంగా తీసుకునేందుకు ఉపయోగపడే విధంగా నాణ్యమైన ప్లేట్లు, గ్లాసులను విద్యార్థులకు అందజేశారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి వారికి ఉపయోగపడే వస్తువులను అందించడం ద్వారా మరోసారి తన సేవా దృక్పథాన్ని, ఉదారతను చాటుకున్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు వారి ఆరోగ్యం, సౌకర్యాల పట్ల కూడా శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొన్నారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు, ముఖ్యంగా విద్యార్థులకు తన వంతు సహాయాన్ని అందిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న డాక్టర్ యల్లంపాటి కోటేశ్వర బాబును స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. గిరిజన విద్యార్థులకు అవసరమైన సామగ్రిని అందించడం పట్ల విద్యార్థులు,ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు విద్యార్థుల్లో మరింత ఉత్సాహాన్ని నింపడంతో పాటు సమాజ సేవ పట్ల స్ఫూర్తిని కలిగిస్తాయని పలువురు పేర్కొన్నారు.

# వినాయక చవితి ఉత్సవాలను సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించుకోవాలి..

**చిత్తూరు, ఆగస్టు 29 ,(మనసులో మాట):-**

వినాయక చవితి వేడుకలను సాంప్రదాయంగా నిర్వహించుకోవాలని చిత్తూరు నగర గణేశ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రామభద్ర అన్నారు. శనివారం చిత్తూర్ ప్రెస్ క్లబ్ నందు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే నిర్వాహకులకు పోలీసులు సకాలంలో అనుమతులు జారీ చేయాలన్నారు. గత ఏడాదిలాగే ఈసారి విద్యుత్ శాఖ వారు వినాయక మండపాలకు విద్యుత్ సరఫరాను ఉచితంగా అందజేయాలన్నారు. మండపాల వద్ద సినిమా పాటలు కాకుండా భక్తి పాటలు మాత్రమే లౌడ్ స్పీకర్ లో పెట్టాలని సూచించారు. కట్టమంచి చెరువు వద్ద నిమజ్జన వేడుకలకు నగరపాలక యంత్రాంగం, ఇతర శాఖలు సమన్వయం చేసుకొని ఏర్పాటు చేయాలని కోరారు. కట్టమంచి చెరువు వద్ద నిమజ్జనం కోసం నగర పాలక్ అధికారులు నీటిని నింపాలని కోరారు. నిమజ్జనానికి ముందుగా జల శుద్ధి కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు 9 రోజులలోనే ఉత్సవాలు పార్టీ చేయాలనీ, అలా కాకుండా నెల పొడవునా చేయడం సరికాదని సూచించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు వెంకటేష్, శ్రీనివాసులు, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



మనసులో మాట

# ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలి





**బద్వేలు, మనసులో మాట, ఆగస్టు 29:**
మార్కాపురం జిల్లా పరిధిలోని "పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును"ఈ నెల 31వ తారీకున రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు చంద్రబాబునాయుడు జాతికి అంకితం చేయు సందర్భంగా గిద్దలూరు నియోజకవర్గం కొమరోలు మండలం నుండి వేలాదిగా అధిక సంఖ్యలో హాజరై సభను జయప్రదం చేయవలసినదిగా రాష్ట్ర నాయిబ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొలవలి వేణుగోపాల్ పిలుపునిచ్చారు. శనివారం కొమరోలు మండల తెదేపా కార్యకర్తల సమావేశము కొమరోలు పట్టణంలో తెదేపా మండల అధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి వేణుగోపాల్ మాట్లాడుతూఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలోని 30 మండలాల రైతు సోదరుల దశాబ్దాలనాటి కల, చిరకాల వాంఛ నెరవేరుతున్న సందర్భంలో రైతు సోదరులు, మండలంలోని ప్రతి గ్రామ పంచాయితీ పరిధిలోని తెదేపా కార్యకర్తలు, కూటమి నాయకులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని మరియు సభను జయప్రదం చేయవలెనని కోరడమైనది ఈ సమావేశంలో కొమరోలు సింగల్ విండో అధ్యక్షులు ముత్తుమల సంజీవరెడ్డి, క్లస్టర్ ఇంచార్జి భూపాల్ యాదవ్, చిన్నపరెడ్డి తిరుమలరెడ్డి, అంబారపు సుబ్రహ్మణ్యం, పోలెబోయిన మద్దిలేటి, షేక్ బాషా,తెదేపా బీసీ నాయకులు గోవిందాయపల్లె కృష్ణయ్య, బద్వేలు వెంకటసుబ్బయ్య(బాబు) కూటమి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు పాల్గొన్నారు

# తెలుగు భాష వైభవాన్ని కాపాడుకుందాం

- **రాజుపాలెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.బాల ఓబన్న పిలుపు**





**బద్వేలు, మనసులో మాట, ఆగస్టు 29:**
తెలుగు భాషా వైభవాన్ని, విశిష్టతను కాపాడుకుందామని రాజుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.బాల ఓబన్న పిలుపునిచ్చారు.
తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం బద్వేలు మండల పరిధిలోని రాజుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ఎన్.బాల ఓబన్న మాట్లాడుతూ వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు జన్మదినాన్ని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవాన్ని, మేజర్ ధ్యాన్ చంద్ జన్మదినాన్ని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవాన్ని జరుపుకుంటామని తెలిపారు. ప్రపంచ భాషలలోనే అత్యంత గొప్ప భాష, మధురమైన భాష తెలుగు భాష అని పేర్కొన్నారు. తెలుగు భాషలో ఉన్న నుడికారాలు, సామెతలు, శబ్దపల్లవాలు, అవధాన ప్రక్రియ, అలంకారాలు, ఛందో ప్రక్రియ, మరే భాషలో లేవన్నారు. ప్రపంచవ్యాప్తంగా 6600 భాషలు ఉండగా తెలుగు భాష 16వ స్థానాన్ని ఆక్రమించడం గొప్ప విషయమ న్నారు. ఐదేళ్ళ క్రితం తెలుగు భాషకు ప్రాచీన హోదా లభించిందని పేర్కొన్నారు. ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ అని కీర్తించబడిందంటే తెలుగు భాష ప్రశస్తి ఏ పాటిదో గుర్తించవచ్చున్నారు. అలాంటి భాష నేడు నిరాధారణకు గురి అవుతున్నదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరి మీద ఉన్నదని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల పట్ల కూడా ఆసక్తిని ప్రదర్శించాలన్నారు. కృషి ఉంటే క్రీడలలో రాణించవచ్చని, ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.
తెలుగు భాష ఉపాధ్యాయులు మారన విజయ కుమార్ మాట్లాడుతూ గ్రాంథిక భాషగా ఉన్న తెలుగును వ్యవహారిక భాష లోకి మార్చడానికి గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన కృషి ఎనలేనిదన్నారు. తెలుగు భాషా వికాసానికి గురజాడ అప్పారావు,కందుకూరి వీరేశలింగం పంతులు చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. రాయప్రోలు, త్రిపురనేని, చిలకమర్తి, పానుగంటి, శ్రీశ్రీ, కాళోజీ, సినారె లాంటి మహాకవులు తెలుగు సాహిత్యాన్ని ఉన్నత శిఖరాలకు చేర్చారని కొనియాడారు. ఈనాడు భారతదేశంలో హిందీ తర్వాత అత్యధికంగా మాట్లాడే భాష తెలుగు అని, ప్రపంచ భాషలలో మాండరిన్ తర్వాత తెలుగు రెండో స్థానంలో ఉన్నదని, అయితే ఆధునిక పరిణామ మార్పులు నేపథ్యంలో తెలుగు భాష విపరీతంగా నిరాధారణకు గురవుతున్న భాషల్లో తెలుగు కూడా ముందంజలో ఉండటం బాధాకరమన్నారు. విదేశీయుడైనప్పటికీ ఉద్యోగ శిక్షణలో భాగంగా తెలుగు నేర్చుకున్న సిపి బ్రౌన్ భాషపై మమకారం పెంచుకొని తాళపత్రాలు సేకరించి మిణుగు మిణుగు మంటున్న తెలుగు దీపాన్ని వెలిగించాడన్నారు. భాష కేవలం భావ వ్యక్తీకరణకు మాత్రమే కాదని మానవ సంబంధాలను అభివృద్ధిపరిచే సాంస్కృతిక ప్రతిబింబని ఆయన పేర్కొన్నారు. తెలుగు భాష వికాసానికి, అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాటుపడాలని ఆయన కోరారు. అనంతరం వివిధ పోటీలలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతుల ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.ఆంథోనీ రావు, పట్టెం వెంకటసుబ్బారెడ్డి, బి.థామస్, టి.దస్తగిరి, ఎ.రాజేంద్ర రాజు తదితరులు పాల్గొన్నారు

# తెలుగు బాషాకు ప్రధాన్యత ఇద్ధాం



బాలాయపల్లి (మనుసులో మాట): తిరుపతిజిల్లా బాలాయపల్లి మండలం జయంపు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం తెలుగు భాషా దినోత్సవాన్ని,జాతీయ క్రీడా దినోత్సవం,దయాచాంద్ జన్మదిన వేడుకలు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాన్ పీటర్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ 1 నాగేశ్వరరావు, ఎంఈఓ 2 బీరం. ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ 1 నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు భాష అభివృద్ధి, వ్యావహారిక భాషకు ప్రాధాన్యత కల్పించ డంలో గిడుగు రామ్మూర్తి చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. మాతృభాష అయిన తెలుగును ప్రేమించి, దైనందిన జీవితంలో విస్తృతంగా ఉపయోగించడం ద్వారా భావితరాలకు భాషా సంపదను అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. అనంతరం ఎంఈఓ 2 బీరం ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు తెలుగు పద్యాలు, ప్రసంగాలు, పాటలు, సాంస్కృతిక ప్రదర్శనలతో తమ ప్రతిభను చాటుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందన్నారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, శారీరక దారుఢ్యం, జట్టుగా పనిచేసే తత్వాన్ని పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. వివిధ క్రీడాంశాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. అనంతరం మాతృభాషను గౌరవిస్తూ, తెలుగు భాషా పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. తెలుగు భాషపై విద్యార్థుల్లో మరింత ఆసక్తి, అభిమానం పెంపొందించే లక్ష్యంతో ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్తులోనూ నిర్వహిస్తామని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాన్ పీటర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలుగు టీచర్ శ్రీలక్ష్మి, పిడి సునంద, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# కొండగోపాలస్వామి సన్నిధికి పోటెత్తిన భక్తజనం



- **శ్రావణోత్సవం మూడో వారంలో అంగరంగ వైభవంగా ప్రత్యేక పూజలు – భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు**

**బద్వేలు, మనసులో మాట, ఆగస్టు 29:**
శ్రావణమాసం మూడో వారం సందర్భంగా నియోజకవర్గం లోని అట్లూరు మండలంలోని ప్రసిద్ధ శ్రీ కొండగోపాలస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. అట్లూరు, రెడ్డిపల్లి, కొండూరు గ్రామాల మధ్య కొండల్లో ప్రకృతి అందాల నడుమ వెలసిన స్వామివారిని దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.శ్రావణోత్సవాల్లో భాగంగా స్వామివారికి తెల్లవారుజామునే ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మంగళ వాయిద్యాల నడుమ స్వామివారికి విశేష పూజలు నిర్వహించడంతో ఆలయ పరిసరాలు భక్తిశ్రద్ధలతో మార్మోగాయి. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శ్రీ కొండ గోపాల స్వామి ఆలయ ధర్మకర్త బొవిల్ల.నందగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తాగునీరు, భోజనం తదితర సౌకర్యాలను అందుబాటులో ఉంచారు. శ్రావణమాస ఉత్సవాలను అత్యంత సుందరంగా, వైభవంగా నిర్వహించడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.ప్రతి శ్రావణ శనివారం స్వామివారి దర్శనానికి భక్తులు భారీగా తరలివస్తుండటంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోతోంది. స్వామివారి ఆశీస్సులు పొందేందుకు భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చారు.

మనసులోమాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# ఆగస్టు 30న చిత్తూరు జిల్లాలో నీట్‌పీజీ

- 2026 పరీక్ష పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి.జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



**చిత్తూరు ఆగస్టు, 29 (మనసులో మాట):**
చిత్తూరు జిల్లాలో నీట్‌పీజీ-2026 పరీక్షను ఆగస్టు 30, 2026న ప్రశాంతంగా, పారదర్శకంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సంబంధించి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో అవసరమైన చర్యలు చేపట్టాలని శనివారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 594 మంది అభ్యర్థులు కంప్యూటర్ ఆధారిత విధానంలో పరీక్షకు హాజరుకానున్నారని, ఈనెల 30వ తేదీన పరీక్ష ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్నారని, అభ్యర్థులు ఎగ్జామ్స్ సెంటర్ కు ఉదయం 7.00 గంటల నుంచి అనుమతించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో చిత్తూరు, పలమనేరు, కుప్పం ప్రాంతాల్లో మొత్తం నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది చిత్తూరులోని శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, పలమనేరులోని మదర్ థెరిసా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, కుప్పంలోని కుప్పం ఇంజినీరింగ్ కాలేజ్, ద్రావిడియన్ యూనివర్సిటీ పరీక్షా కేంద్రాలుగా ఉన్నాయని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద తగినంత మంది పురుష, మహిళా పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసి అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. మినియేచర్ స్పై కెమెరాలు, కెమెరా కలిగిన కళ్లద్దాలు, ఇయర్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ పరికరాలు, చిట్స్, నోట్స్, పేపర్లు తదితర నిషేధిత వస్తువులను పరీక్షా కేంద్రాల్లోకి తీసుకురాకుండా కట్టుదిట్టమైన తనిఖీలు చేపట్టాలని సూచించారు. ఆన్‌లైన్ పరీక్షల సమగ్రత, గోప్యతను కాపాడేందుకు సైబర్ భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, పరీక్షా కేంద్రాలకు సమీపంలోని సైబర్ పోలీస్ స్టేషన్ల ద్వారా సైబర్ ముప్పులను పర్యవేక్షించాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో పరీక్ష ప్రారంభానికి రెండు గంటల ముందుగానే నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల పరిసరాలు, ప్రవేశ ద్వారాలు, పరీక్షా గదులు, టేబుళ్లు, కుర్చీలు, మరుగుదొడ్లు, వాష్‌బేసిన్లు, నీటి ప్రదేశాలు, పరికరాలు, లిఫ్టులు తదితర ప్రాంతాలను పూర్తిగా శానిటైజ్ చేయాలని సూచించారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేరుకునేలా ఏపీఎస్ఆర్టీసీ బస్సులను అవసరమైన మేరకు నడపాలని, పరీక్ష అనంతరం అభ్యర్థులు తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు తిరుగు ప్రయాణానికి కూడా తగిన బస్సు సౌకర్యం కల్పించాలని తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో అవసరమైన వైద్య అత్యవసర సేవలతో పాటు తగిన సంఖ్యలో ఏఎన్ఎం లను అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద శాంతిభద్రతలకు భంగం కలగకుండా భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, 2023లోని సెక్షన్ 163ను అమలు చేయడంతో పాటు, పరీక్షా కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలోని జిరాక్స్ కేంద్రాలు, నెట్ సెంటర్లను పరీక్ష సమయంలో మూసివేయించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత తహసీల్దార్లను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో ఇంటర్నెట్ కనెక్టివిటీ సక్రమంగా ఉండేలా కళాశాలల చీఫ్ సూపరింటెండెంట్లు ముందస్తు ఏర్పాట్లు చేయాలని, సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారులు పరీక్షా కేంద్రాలను ముందుగానే పరిశీలించి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. నీట్‌పీజీ-2026 పరీక్షను సజావుగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కే మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

# ఇజ్రాయెల్‌లో హోమ్ బేస్డ్ కేర్‌గివర్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

- జిల్లాలోని 60 మంది మహిళలకు విదేశీ ఉపాధి అవకాశం..

**చిత్తూరు ఆగస్టు 29 మనసులో మాట):-**
చిత్తూరు జిల్లాలోని నిరుద్యోగ ఎస్సీ మహిళలకు విదేశీ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం మరో అవకాశాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది.నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఇజ్రాయెల్‌లో హోమ్ బేస్డ్ కేర్‌గివర్ ఉద్యోగాల భర్తీకి అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డు కులముల సేవా సహకార సంఘం లిమిటెడ్ కార్యనిర్వాహక సంచాలకులు వీవీ హరీష్ కోలా తెలిపారు.ఈ నియామకాల ద్వారా చిత్తూరు జిల్లాకు చెందిన 60 మంది మహిళలకు విదేశీ ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఉందని వెల్లడించారు.
25 నుంచి 45 సంవత్సరాల వయస్సు కలిగి, కనీసం 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులకు కనీసం 1.5 మీటర్ల ఎత్తు, 45 కిలోల బరువు ఉండాలి. అలాగే సి ఈ ఎఫ్ ఆర్‌బి2 స్థాయి ఆంగ్ల భాషా పరిజ్ఞానం తప్పనిసరి. భారత ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థలో ఒజేటీతో కలిపి 990 గంటల కేర్‌గివింగ్ కోర్సు పూర్తి చేసి సర్టిఫికెట్ పొందిన వారు అర్హులు. సి డి ఎ, ఏఎన్ఎం సిడియం బీఎస్. నర్సింగ్, పోస్ట్ బీఎస్సీ అర్హతలు ఉన్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులకు కనీసం మూడు సంవత్సరాల గడువు ఉన్న పాస్‌పోర్ట్ ఉండాలి. గతంలో ఇజ్రాయెల్‌లో పనిచేసి ఉండకూడదు. అలాగే వారి జీవిత భాగస్వామి, తల్లిదండ్రులు లేదా పిల్లలు ప్రస్తుతం ఇజ్రాయెల్‌లో నివసిస్తూ లేదా పనిచేస్తూ ఉండకూడదు. ఎంపిక ప్రక్రియలో పిసిసి, వైద్య పరీక్షలు, మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండనున్నాయి.
ఎంపికైన వారికి నెలకు 6,443.85 ఎన్ ఐ ఎస్ స్థూల వేతనం లభించనుంది. భారత కరెన్సీలో ఇది సుమారు రూ.1.99 లక్షల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. అదనంగా యజమాని ద్వారా వైద్య బీమా, వసతి, ఆహార సౌకర్యాలు కల్పించనున్నారు. వారానికి ఆరు రోజుల పని ఉంటుంది. ఉద్యోగ ఒప్పందం రెండేళ్ల పాటు ఉండి, తదుపరి పునరుద్ధరణకు అవకాశం ఉంటుంది.
అర్హత మరియు ఆసక్తి ఉన్న మహిళలు ఏపీ ఎస్సీ సి ఎఫ్ సి అధికారిక వెబ్‌సైట్‌లో వివరాలు తెలుసుకోవడంతో పాటు, చిత్తూరు జిల్లా షెడ్యూల్డు కులముల సేవా సహకార సంఘం కార్యాలయాన్ని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. మరిన్ని వివరాల కోసంఏఈఓ కె. మేఘనాథన్ - 9959403234 సీనియర్ అసిస్టెంట్ కె. చిట్టిబాబు - 9959015657 నంబర్లను సంప్రదించవచ్చు.
చిత్తూరు జిల్లాలోని అర్హులైన ఎస్సీ మహిళలు ఈ విదేశీ ఉపాధి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

# వెంకటేశ్వర స్వామివారికి ₹2.5 లక్షల విలువైన వెండి కటిహస్తం సమర్పణ

**బద్వేలు, మనసులో మాట, ఆగస్టు 29 :**
బద్వేల్ మున్సిపాలిటీ పరిధి లక్ష్మీపాలెం గ్రామంలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో శనివారం భక్తిశ్రద్ధల నడుమ విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీపాలెం గ్రామ వాస్తవ్యులు, కీర్తిశేషులు కామసముద్రం రాజా గోపాలచార్లు జ్ఞాపకార్థం, వారి ధర్మపత్ని కె. మణి లక్ష్మి మరియు కుటుంబ సభ్యులు స్వామివారికి వెండి కటిహస్తాన్ని బహూకరించారు. ఈ వెండి కటిహస్తం బరువు సుమారు 0.75 కిలోలు (750 గ్రాములు) కాగా, దీని విలువ దాదాపు ₹2.5 లక్షలు ఉంటుందని ఆలయ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా దాత మణి లక్ష్మి మాట్లాడుతూ స్వామివారికి వెండి కటిహస్తం సమర్పించుకోవాలని తమ కుటుంబానికి చాలా కాలంగా మొక్కుబడి ఉందని, ఈ రోజు ఆ మొక్కు తీరినందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. స్వామివారి సేవలో భాగస్వాములవ్వడం తమ పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, కటిహస్తాన్ని స్వామివారికి అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయం ఈవో కృష్ణయ్య, కొండయ్యలతో పాటు కుటుంబ సభ్యులు, గ్రామ భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, గ్రామస్థులు దాత కుటుంబ సభ్యులను శాలువాతో సత్కరించి స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి వారి కుటుంబ సభ్యులను అభినందించారు. శ్రీ వెంకటేశ్వర స్వామివారి దివ్య మంగళ ఆశీస్సులు, పరిపూర్ణ అనుగ్రహం కామసముద్రం రాజా గోపాలచార్లు కుటుంబ సభ్యులందరిపై ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు.



# రెడ్డిపల్లి శ్రీ గోపాలస్వామి ఆలయం వద్ద ఉచిత వైద్య శిబిరం



**బద్వేలు, మనసులో మాట, ఆగస్టు 29:**
నియోజకవర్గంలోని అట్లూరు మండలం రెడ్డిపల్లి గ్రామంలోని శ్రీ రెడ్డి గోపాలస్వామి ఆలయం వద్ద శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన శిబిరంలో భక్తులకు, గ్రామ ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించారు. బీపీ, షుగర్ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో సీహెచ్‌వో సి.మురళీకృష్ణ, సూపర్‌వైజర్ బి.సుబ్రహ్మణ్యం, ఏఎన్ఎం పి.విజయలక్ష్మి, ఎంపీహెచ్‌ఏ నాగేశ్వరరావు, ఆశా కార్యకర్తలు నాగేశ్వరమ్మ, సునీత, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మనసులో మాట

# నీట్ పీజీ పరీక్షకు పటిష్ట పోలీసు బందోబస్తు

- నాలుగు కేంద్రాల్లో 950 మంది అభ్యర్థులు
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల




**నెల్లూరు, ప్రతినిధి, ఆగస్టు 29, మనసులో మాట:**

ఈ నెల 30వ తేదీ ఆదివారం జరగనున్న నీట్, పీజీ ప్రవేశ పరీక్షకు జిల్లా పోలీసు శాఖ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసింది. జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు జిల్లాలోని నాలుగు పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు. ఎండి, ఎంఎస్, పీజీ డిప్లొమా తదితర వైద్య పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఈ పరీక్షకు జిల్లాలో మొత్తం 950 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. పరీక్ష ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొనసాగనుంది. అభ్యర్థులు ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, ఉదయం 8.30 గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ కేంద్రాల్లోకి అనుమతించబోమని పోలీసులు స్పష్టం చేశారు. పరీక్షలు ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక పోలీసు బందోబస్తుతో పాటు నిరంతర నిఘా ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల చుట్టుపక్కల 200 నుంచి 300 మీటర్ల పరిధిలో సెక్షన్ 163 బిఎన్ఎస్ చట్టం అమలులో ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ పరిధిలోని జిరాక్స్ సెంటర్లను తప్పనిసరిగా మూసివేయాలని సూచించారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, బ్లూటూత్ పరికరాలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావడం పూర్తిగా నిషేధమని అధికారులు స్పష్టం చేశారు. అదేవిధంగా పరీక్ష పేపర్ లీక్‌కు సంబంధించి తప్పుడు వార్తలు, వదంతులను సోషల్ మీడియాలో ప్రచారం చేయడం, పరీక్షల్లో అక్రమాలకు పాల్పడడం లేదా పరీక్షల నిర్వహణకు ఆటంకం కలిగించే చర్యలకు పాల్పడడం వంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని జిల్లా పోలీసు శాఖ హెచ్చరించింది. నిబంధనలు ఉల్లంఘించే వ్యక్తులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు.

# కాంట్రాక్టు పారామెడికల్ ఎంప్లాయిస్ సమస్యలను పరిష్కరించాలి




- ఐటియుసి డివిజన్ కన్వీనర్ కృష్ణమూర్తి డిమాండ్

**మదనపల్లె, ఆగస్టు 29 మనసులో మాట :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా వైద్య ఆరోగ్యశాఖలో (డీఎంఈ,ఏపి వివిపి,డీపిహెచ్) మూడు విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సెస్, ఫార్మసిస్ట్స్,ల్యాబ్ టెక్నీషియన్లు ఇతర పారా మెడికల్ సిబ్బంది ఐక్యవేదికగా వృత్తి పరమైన సమస్యలు ,దీర్ఘకాలిక న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించి పరిష్కారం చేయాలని కాంట్రాక్ట్ ఉద్యోగుల జేఏసీ మరియు ఐటియుసి డివిజన్ కన్వీనర్,నవజీవన్ వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి జి.కృష్ణమూర్తిలు డిమాండ్ చేశారు.ఇందులో భాగంగా శనివారం మదనపల్లె జిల్లా ప్రభుత్వ బోధన ఆసుపత్రిలో భోజన విరామ సమయం నందు జేఏసీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా జేఏసీ ప్రతినిధులతో కలిసి కృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర పరిధిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సస్,అల్లైడ్ హెల్త్ కేర్ ప్రొఫెషనల్ (పారా మెడికల్ సిబ్బంది)ని రెగ్యులర్ చేయాలని కోరారు.రెగ్యులర్ చేసేవరకు వంద శాతం గ్రాస్ శాలరీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.డ్యూటీలో మరణించిన కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ కి రూ.15 లక్షలు,విధి నిర్వహణలో చనిపోయి కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని,కాంట్రాక్టు ఎంప్లా యిస్ పరస్పర అంగీకార బదిలీలు,వెంటనే అమలు చేయాలన్నారు.రెగ్యులర్ ఎంప్లాయిస్ కి ఇచ్చినట్లు కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ కి కూడా పెయిడ్ సిక్ లీవ్స్ ఇవ్వడంతోపాటు, కాంట్రాక్ట్ వాళ్ళకి కూడా ఈహెచ్ఎస్ హెల్త్ కార్డ్స్ ఇవ్వాలని కోరారు.

# చైతన్య సంస్థలో వెలుగు వ్యవస్థాపకురాలు పద్మజ వర్ధంతి



- చిన్నారులు,వృద్ధులకు అన్నవితరణ

**మదనపల్లె, ఆగస్టు 29 మనసులో మాట :**

దివ్యాంగులు,వృద్ధులు,నిరుపేద మహిళలకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్న వెలుగు స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకురాలు కీర్తిశేషులు పద్మజ 21వ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థలోని చిన్నారులు,ఆనంద వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ జనరల్ సెక్రటరీ ఏ.కవితా రాణి మాట్లాడుతూ వెలుగు సంస్థ గత ఎన్నో సంవత్సరాలుగా దివ్యాంగులు,వృద్ధులు,నిరుపేద మహిళల సంక్షేమం కోసం విశేష సేవలు అందిస్తోందని కొనియాడారు.పద్మజ ఆశయాలను కొనసాగిస్తూ సమాజంలోని అట్టడుగు వర్గాలకు అండగా నిలుస్తున్న వెలుగు సంస్థ సేవలు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.అలాగే వెలుగు సంస్థ సెక్రటరీ ఉదయ మోహన్ రెడ్డి,సంస్థ యాజమాన్యానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.వెలుగు సంస్థ ఇప్పటికీ,ఎప్పటికీ నిరుపేదల కోవెలగా,దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపే సంస్థగా నిలుస్తోందన్నారు. మదనపల్లెలో సేవా భావానికి ప్రతీకగా,అందరికీ స్ఫూర్తినిచ్చే ఆదర్శనీయమైన నిలయంగా వెలుగు సంస్థ కొనసాగుతోందని ఆమె అన్నారు.ఈ కార్యక్రమంలో చిన్నారులు,వృద్ధాశ్రమ వృద్ధులు మరియు చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



# శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు మరియు అన్నదాన కార్యక్రమం

**రామాపురం ఆగస్టు 29 మనసులో మాట :**

అన్నమయ్య జిల్లా రామాపురం మండలం చిట్లూరు గ్రామంలోని పవిత్ర శ్రావణమాసం 3వ శనివారం సందర్భంగా శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి దేవస్థానంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో రామాపురం మండలం టిడిపి అధ్యక్షులు గాలివీటి సురేంద్ర రెడ్డి గారు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.మద జనార్ధన్ రెడ్డి శశికళ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం చేపట్టడం జరిగింది.అనంతరం ఆలయ అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.ఈ సందర్భంగా రామాపురం మండల టిడిపి అధ్యక్షులు గాలివీటి సురేంద్రారెడ్డి ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ఆంజనేయ స్వామివారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA

# మాతృభాష,జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు







- **తెలుగు భాష వైభవాన్ని కాపాడుకుందాం...**
- **విద్యార్థులకు విధితో పాటు క్రీడలు కూడా అవసరం..**
- **ప్రధానోపాధ్యాయులు....**

**బద్వేలు , మనసులో మాట,ఆగస్టు 29:**

తెలుగు భాషా వైభవాన్ని, విశిష్టతను కాపాడుకుందామని,తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం పట్టణంలోని స్థానిక శ్రీ సృజన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ నూరుద్దీన్ ఆదేశాల మేరకు మాతృభాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగినది. శ్రీ సృజన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాదియా నూర్జహాన్ మాట్లాడుతూ ప్రపంచ భాషలలోనే అత్యంత గొప్ప భాష, మధురమైన భాష తెలుగు భాష అని పేర్కొన్నారు.తెలుగు భాషలో ఉన్న నుడికారాలు, సామెతలు, శబ్దపల్లవాలు, అవధాన ప్రక్రియ, అలంకారాలు, చంధో ప్రక్రియ, మరే భాషలో లేవన్నారు.ప్రపంచవ్యాప్తంగా 6600 భాషలు ఉండగా తెలుగు భాష 16వ స్థానాన్ని ఆక్రమించడం గొప్ప విషయమ న్నారు. ఐదేళ్ళ క్రితం తెలుగు భాషకు ప్రాచీన హెూదా లభించిందని పేర్కొన్నారు. మాతృభాష ఎంతో ఘనమైనదని అమ్మను ఎలా గౌరవిస్తామో మాతృభాషను అలాగే గౌరవించాలని పరభాష వ్యామోహంతో




తెలుగు భాషను మరువద్దని విద్యార్థిని విద్యార్థులకు తెలియజేయడము జరిగినది.వ్యవహారిక భాష ఉద్యమ నాయకుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు యొక్క జన్మదినమైన ఆగస్టు 29వ తారీకు మాతృభాషా దినోత్సవం గా జరుపుకుంటున్నామని మాతృభాషకు గిడుగు రామమూర్తి చేసిన సేవ ఎనలేనిదని ఈ సందర్భంగా వారు వ్యాఖ్యానించారు. తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరి మీద ఉన్నదని పేర్కొన్నారు. ఇతర భాషలపై ఉన్న వ్యామోహంతో తెలుగు భాషను మరువద్దని ఇతర భాషలను నేర్చుకోవడం తప్పుకాదని, ఇతర భాషలను నేర్చుకుంటూ తెలుగు భాష పై మమకారాన్ని పెంపొందించుకుని మాతృభాషను మరువ వద్దని విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల పట్ల కూడా ఆసక్తిని ప్రదర్శించాలన్నారు. కృషి ఉంటే క్రీడలలో రాణించవచ్చని, ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని పేర్కొన్నారు. ఈనాడు భారతదేశంలో హిందీ తర్వాత అత్యధికంగా మాట్లాడే భాష తెలుగు అని, ప్రపంచ భాషలలో మాండరిన్ తర్వాత తెలుగు రెండో స్థానంలో ఉన్నదని, అయితే ఆధునిక పరిణామ మార్పులు నేపథ్యంలో తెలుగు భాష విపరీతంగా నిరాధారణకు గురవుతున్న భాషల్లో తెలుగు కూడా ముందంజలో ఉండటం బాధాకరమన్నారు. విదేశీయుడైనప్పటికీ ఉద్యోగ శిక్షణలో భాగంగా తెలుగు నేర్చుకున్న సిపి బ్రౌన్ భాషపై మమకారం పెంచుకొని తాళపత్రాలు సేకరించి మిణుగు మిణుగు మంటున్న తెలుగు దీపాన్ని వెలిగించాడన్నారు. భాష కేవలం భావ వ్యక్తీకరణకు మాత్రమే కాదని మానవ సంబంధాలను అభివృద్ధిపరిచే సాంస్కృతిక ప్రతిబింబని పేర్కొన్నారు. తెలుగు భాష వికాసానికి, అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాటుపడాలని కోరారు. అనంతరం వివిధ పోటీలలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతుల ప్రధానం చేశారు.అనంతరం గిడుగు వెంకట రామమూర్తి పంతులు చిత్రపటానికి మరియు హాకీ క్రీడాకారుడు ధ్యాన్చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి వారిని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాసరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు , మరియు టీచర్లు కె. స్వప్న,జీ. ఫరదా,వి. రోజీ, కె. హరిత, కె. భాగ్యలక్ష్మి, శ్రీదేవి, సుబ్బారావు, నాగరాజు, ఎర్రం రాజు పాఠశాల సిబ్బంది, తదితర అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

### సి సి టీవి ఫుటేజీ ఆధారంగా హత్య కేసు ను

## ఛేదించిన గాలివీడు పోలీసులు



- **మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన డీఎస్పీ ఎం.ఆర్.కృష్ణమోహన్**

**రాయచోటి ఆగస్టు 29 మనసులో మాట :**

అన్నమయ్య జిల్లా రాయచోటి డీఎస్పీ కార్యాలయంలో శనివారం జరిగిన మీడియా సమావేశంలో డీఎస్పీ ఎం.ఆర్. కృష్ణమోహన్ గాలివీడు హత్య కేసు వివరాలను వెల్లడించారు.వివాహేతర సంబంధం నేపథ్యంలో భర్త బాలకృష్ణను దారుణంగా హత్య చేసిన భార్య చిన్నక్క, ఆమెకు సహకరించిన సన్నిహితుడు కడప రఫీ, మరియు నవీన్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు.డీఎస్పీ పర్యవేక్షణలో కొనసాగిన దర్యాప్తులో, ఎటువంటి ప్రాథమిక ఆధారాలు లేని ఈ కేసును 100కు పైగా సీసీటీవీ కెమెరాల ఫుటేజ్‌లు, సాంకేతిక ఆధారాలతో పోలీసులు చాకచక్యంగా ఛేదించారు.జిల్లా ఎస్పీ శ్రీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ ఆదేశాలతో ఈ కేసును ఛేదించిన సీఐ హెచ్. కృష్ణంరాజు నాయక్, ఎస్ఐ జె. నరసింహారెడ్డి, బి.శివకుమార్,సిసిఎస్ ఏఎస్ఐ సర్దార్ కానిస్టేబుళ్లు మహేంద్ర నాయుడు, బర్కత్ లను ఎల్ఆర్ పల్లి సర్కిల్ పోలీసు సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



# సెప్టెంబర్ 2 న జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించాలి

- **అనకాపల్లి ఇంచార్జ్ భీమరశెట్టి రాంకీ జనసేన శ్రేణులకు పిలుపు**

**అనకాపల్లి ప్రతినిధి, ఆగష్టు 29 (మనసులో మాట):**

నసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు సెప్టెంబర్ 2 న అనకాపల్లి నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించాలని జనసేన పార్టీ ఇంచార్జీ భీమరశెట్టి రాంకీ ఆపార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు త్వరలో జరగనున్న నేపథ్యంలో



మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆదేశాల మేరకు స్థానిక రింగ్ రోడ్డు లోని జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం అనకాపల్లి జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జి భీమరశెట్టి రాంకీ అధ్యక్షతన నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భీమరశెట్టి రాంకీ మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను ప్రతి గ్రామం, ప్రతి మండలం, ప్రతి వార్డు స్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసికట్టుగా నిర్వహించాలని సూచించారు. పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలు, ప్రజా సేవా స్ఫూర్తిని ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లే విధంగా జన్మదిన వేడుకలు ఉండాలని అన్నారు. జన్మదిన వేడుకల్లో భాగంగా అనకాపల్లి నియోజకవర్గంలో భారీ బైక్ ర్యాలీ ని నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. పార్టీ నాయకులు, జనసేన వీర మహిళలు, యువత, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే పవన్ కళ్యాణ్ పుట్టినరోజు పురస్కరించుకుని ప్రజలకు ఉపయోగపడే విధంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని నాయకులకు సూచించారు. జన్మదిన వేడుకలు కేవలం సంబరాలకు పరిమితం కాకుండా ప్రజాసేవకు ప్రతీకగా నిలిచేలా కార్యక్రమాలను రూపొందించాలని తెలిపారు. ఈ సమావేశంలో అనకాపల్లి నియోజకవర్గానికి చెందిన జనసేన పార్టీ నాయకులు, మండల జనసేన అధ్యక్షులు, వార్డు నాయకులు, ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.